జయజయ శంకర




హరహర శంకర

సంపుటి : 2 సంచిక : 2&3

# శ్రీ కామకోటి వాణి

శ్రీ శోభకృత్ ఆశీయుజ మాసం - సెప్టెంబర్ - అక్టోబర్ 2023



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము

# భాష ఏదైనా వేదం, మంత్రం, మందిరం, మనస్సు – ఇవే మన సమైక్యతకు, సాత్వికతకు కారణం

## వర్గల్‌లో పండిత సత్కారసభ సందర్భంగా శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారి అనుగ్రహభాషణం

నారాయణం పద్మభువం వశిష్ఠం శక్తిం చ తత్పుత్ర పరాశరం చ ।
వ్యాసం శుకం గౌడపాదం మహాంతం గోవింద యోగీంద్ర మథాస్య శిష్యమ్ ॥
శ్రీ శంకరాచార్యమథాస్య పద్మపాదం చ హస్తామలకం చ శిష్యమ్ ।
తమ్ తోటకం వార్తికకారమన్యాన్ అస్మద్గురూన్ సంతతమానతోస్మి॥
సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమామ్ ।
అస్మదాచార్య పర్యన్తాం వందే గురు పరంపరామ్ ॥
అపార కరుణాసింధుం జ్ఞానదం శాంతరూపిణమ్ ।
శ్రీ చంద్రశేఖర గురుం ప్రణమామి ముదాన్వహమ్ ॥
దేవే దేహే చ దేశే చ భక్త్యారోగ్య సుఖప్రదమ్ ।
బుధ పామర సేవ్యం తం శ్రీ జయేంద్రం నమామ్యహమ్ ॥



ఈ రోజు నవమి. సరస్వతీ అమ్మవారికి విశేషంగా అనేక ద్రవ్యములతో పళ్ళరసములతో, చందనంతో హరిద్ర మరియు సుగంధ ద్రవ్యములతో అభిషేకం జరిగింది. అలంకారం, అర్చన, హారతి ఇవన్నీ కూడా మహాభిషేకంలో భాగం. వేదంలో మహాభిషేకం అనేది ఒక ప్రకరణం. ఐత్తిరీయ బ్రాహ్మణంలో ఏమేమి పూజా ద్రవ్య ఫలితాలు చెప్పారో అలాగే ఈ రోజు అంత గొప్పగా, విశేషంగా సరస్వతీ అమ్మవారికి అభిషేకం జరగడం అనేది గొప్ప విశేషంగా చెప్పుకోవాలి. ఇంకా ఇక్కడ భౌమాశ్విని ప్రయుక్తంగా చండీహోమం కూడా ఏర్పాటు అవుతున్నది. ఈ రోజుల్లో గుళ్ళు ఎక్కువ కడుతున్నారు కాని శంకరమఠం కట్టడం అనేది తగ్గింది. యాయవరం చంద్రశేఖర సిద్ధాంతిగారు త్వరగా దీనిని పూర్తి చేశారు. స్థల సేకరణ నుంచి అన్ని విషయాలకు సమయం పట్టింది. మేము రావడానికి కూడా సమయం పట్టింది. కాని పూర్తి చేసి చంద్రమౌళీశ్వరస్వామి పూజ జరపడానికి అనుకూలంగా వారు ఏర్పాటు చేశారు. ఇంకా నవరాత్రులు కూడా ఇక్కడ చేయించాలన్న అభిలాష ఉంది. అలాంటి శంకరమఠాలు కావాలి అనే విషయము ఇప్పుడు అక్కడక్కడ కూడా చెప్పడమైనది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఆ స్వతంత్రం ఫలితంగా ప్రజలకి నీరు, నీడ ఇంకా రహదారిమార్గాలు, హాస్పటల్స్, విద్యాసంస్థలు ఇవన్నీ వస్తున్నాయి. తెలంగాణ ప్రత్యేకంగా ఏర్పాటు అయిన తరువాత ఇక్కడ కూడ లౌకిక సదుపాయాలైన నీరు, నీడ కోసం కఠినమైన ప్రయత్నాలు జరిగాయి. అనేక సామాజిక సేవా కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. అలా జరుగుతున్నప్పుడు ప్రజలకి అవసరమైన పాంచ భౌతిక శరీర తుష్టి, పుష్టి, విద్య, ఉపాధి జరుగుతున్నాయి. నిరుద్యోగం – నిరుద్యోగిత పని చేయకుండా ఉండటం ఒకటి, పని దొరకలేదు అనేది మరొకటి. ఇప్పుడు అలాంటి 'ఉద్యోగినం పురుషసింహం ఉపైతి లక్ష్మీః' అనే విధంగా సరస్వతీ సేవలో లక్ష్మీ కటాక్షం కూడా వర్గల్ లో ఉంది. లక్ష్మీ, సరస్వతి అనుగ్రహంతో ఇక్కడ భవన నిర్మాణంలాంటి చక్కటి ఏర్పాట్లు, అన్నదానం వసతి చేయడం వల్ల హైదరాబాద్ నుంచి బయటకి రావడానికి అనుకూల స్థానం వర్గల్ అనే విధంగా ఉంది. చూడడానికి వచ్చిన వారికి ఉదయం నుంచి దర్శనాలు, సేవలు వేదమంత్రాలు, అన్నదానంతో ఈ ప్రాంతం వికాసమవుతున్నది. పెద్ద పెద్దవాళ్ళందరూ కూడా శని, ఆదివారాలలో వస్తున్నారని విన్నాము. అలా ఇక్కడ శంకరమఠం రావడం ఈ ప్రాంతం, జిల్లా అనే కాకుండా భాగ్యనగరానికి కూడా అది సహాయకంగా ఉంటుంది.

కాలడిలో పుట్టిన శంకరాచార్యులు కాశీకి వెళ్ళి జ్ఞాన ప్రచారం చేస్తూ అన్ని చోట్లా మార్పు తీసుకువచ్చారు. కామాఖ్య, కేదార్‌నాథ్,



కాశ్మీర్, కాశీ అన్ని చోట్లా పూజా విషయంలో వారు సకారాత్మకమైన మార్పు తెచ్చారు. నేపాలం నుంచి పశుపతినాథ క్షేత్రానికి వెళితే ఈ రోజుకీ 'వింధ్యాత్ దక్షిణేజాతాః' – వింధ్యపర్వతానికి దక్షిణంవైపు పుట్టినవాళ్ళు అక్కడ పూజ, అభిషేకం, చేస్తున్నారు అని చెప్తారు. దేశం, భాష వేరు, నమ్మకాలు కూడా కొద్ది మార్పుగా ఉంటాయి. కాని భాష ఏదైనా వేదం, మంత్రం, మందిరం, మనస్సు – ఇవే మన సమైక్యతకి, సాత్వికతకి కారణం. అందుకని మనం మఠాల్ని పోషించాలి. మందిరాలను జాగ్రత్తగా చూసుకోవాలి. జీర్ణోద్ధారణ, కుంభాభిషేకాలు చేయాలి. మంత్ర విద్యని కాపాడాలి. చదువుకున్నవారు, పేదవారు, పెద్దభూస్వాములు ఇలా అనేక రకాలైన మనుష్యులు ఉన్నారు. ఒకవిధంగా చూస్తే అందరూ గొప్పవాళ్ళే. ఆర్థికంగా, విద్యాపరంగా తేడా ఉన్నా భక్తుడు వినయంతో వ్యవహరిస్తాడు. ఆ సౌజన్యానికి కారణం మన ధర్మం. అందుకే ధర్మాన్ని కాపాడితే ప్రజల్ని కాపాడవచ్చు. మన జయేంద్ర సరస్వతీ స్వామివారు 'వేదరక్షణం అంటే లోకరక్షణం' అని చెప్పేవారు. ఆయన అనేక వ్యవస్థలు చేసి సరిచేసి, వర్గల్‌వైపు ప్రసరింపజేసిన ఫలితంగా ఈ రోజు ఇక్కడ ఇంత మంచి కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ ప్రారంభోత్సవ సందర్భంగా చెన్నైలో ఉన్న తెలుగువారైన ఒక కుటుంబానికి చెందిన వాళ్ళకి వర్గల్‌లో విద్యాసరస్వతీ ఆలయం దగ్గర సేవ చేయండి అని చెప్పాము. విద్యాసరస్వతి క్షేత్రంలో ఆధ్యాత్మవిద్యలో సేవ చేస్తున్న వేదపండితులకి, స్మార్తపండితులకి, శ్రౌతపండితులకి, శాస్త్రపండితులకి సన్మానం ఇక్కడ చేయవచ్చు. అప్పుడప్పుడు ఇలాంటి నేతృత్వాలు చేయడానికి అవకాశం వస్తుంది. మన సౌకర్యాన్ని బట్టి చేయగలిగినది చేయాలి. భౌతిక విషయం. ధార్మిక విషయం వచ్చినప్పుడు ఈ దేశం యొక్క సంస్కృతిని కాపాడాలి. కుటుంబవ్యవస్థని కాపాడాలి. పుణ్యంలో ఆదరణ, పాపంలో భయం – అనే ఆలోచనలతో ప్రజలు ఉండాలి. సేవా కార్యక్రమాలు, సేవాభావం, ఉండాలి. ధర్మప్రచారం జరిగితేనే ఇలాంటి ఆలోచనలకు స్ఫూర్తి, ప్రేరణ కలుగుతుంది.

నూతన భారత నిర్మాణంలో ప్రాచీన శాస్త్ర, ధర్మప్రచారం ముఖ్యం. సంస్కృతభాషని, గుడిగోపురాలను కాపాడాలి. తెలంగాణ కొన్ని



సంవత్సరాలు అనేక విఘ్నాలు వచ్చిన ప్రదేశం కనుక ఇక్కడ కష్టం ఏమిటో తెలుస్తుంది. దాని యొక్క విలువ కూడా తెలుస్తుంది. తెలంగాణా ప్రజలు ఉత్సాహంగా పూర్వ వైభవం తీసుకురావాలి. పూర్వం మంథని, ధర్మపురిలలో ఉండే అగ్రహార వ్యవస్థని మరల తీసుకురావాలనే తపన, ఉత్సాహం, ఇక్కడ ప్రజలలో, ప్రభుత్వంలో కనిపిస్తోంది. తెలంగాణాలో వేదపాఠశాలలు, వేదసభలు, స్మార్తపాఠశాలలు త్వరితగతిలో వికాసం పొందుతున్నాయి. దానికి అనుకూలంగా సాంప్రదాయ పాఠశాల కూడా భాగ్యనగరంలో మరియు పిల్లలమర్రి, పాలమూరులలో ప్రారంభించడం జరిగింది. ముఖ్యంగా చంద్రశేఖర సిద్ధాంతి ద్వారా ఇక్కడ శంకరమఠం ప్రారంభం చేయడం ఇతర జిల్లాలకి ఒక మార్గదర్శకంగా ఉంటుంది. మన జిల్లాలో శంకరమఠం కట్టి ఇలాంటి ఉపనయనాలు, 5రోజులు వివాహాలు జరగడానికి వీలుగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడ్ చేయాలన్న ఆలోచన వస్తుంది. శాస్త్ర ప్రకారం జరగాలన్నప్పుడు విద్య, కుటుంబవ్యవస్థ, జీవనోపాధి ఉండాలి. ఇక్కడ దేవాదాయ ధర్మాదాయశాఖ ద్వారా ప్రభుత్వంతో మాట్లాడి దానికి అనేక చర్యలని తీసుకుంటున్నారు. ఒకవారం క్రిందట జరిగిన నూతన బ్రాహ్మణభవనం ప్రారంభ ఉత్సవంలో ప్రభుత్వం తరపున కూడా అనేక పథకాలు వివరించడం జరిగింది. వీటన్నింటిని సమకూర్చి సమన్వయం చేసి వేదము, శాస్త్ర పరంపర, పురాణాలు బాగా ప్రచారం జరిగితే తద్వారా తెలంగాణా ప్రాంతంలో భౌతిక, ధార్మిక వికాసాలు రెండూ వస్తాయి. వేదపండితులు ఏదైతే సంకల్పాలు చెప్తుకుంటున్నారో 'ఇహాముత్ర' అంటే ఐహిక, ఆముష్మిక శ్రేయస్సు ఉంటుంది.

## వర్గల్ అనేది ఒక అభివృద్ధి మోడల్

ఈ సంకల్పానికి నాన్‌పొలిటికల్ లీడర్‌షిప్ ముఖ్యమైనది. దానికి పునాదిగా వేదపాఠశాలలు. మంచి అధ్యాపకులు కావాలి. క్రిందటిసారి వచ్చినప్పుడు వర్గల్‌లో చాలామంది అధ్యాపకులను చూసాము. వారు చాలామంది విద్యార్థులను తయారు చేశారని, ఇప్పుడు చూస్తున్నాం. అధ్యాపకవృత్తి అనేది కేవలం విద్యతో జరిగేపని మాత్రమే కాదు., బాధ్యత కూడా. హైదరాబాద్ నుంచి ధన సేకరణ చేసి పంపించినా ఇక్కడ స్థానికంగా ఉండి, పిల్లలకి మంచిగా పాఠం చెప్పి, తల్లిదండ్రులకు మంచి సమాధానం చెప్పి, నమ్మకం ఇచ్చేవాళ్ళు ఉండాలి. ఆ అధ్యాపకులు విద్యను నేర్పిస్తూ ఆచారం, ఆత్మగుణాలు, సేవాభావం, యజమానులతో ఉండవలసిన సత్సంబంధాలు ఇవన్నీ కూడా నేర్పించాలి. ఇంత పెద్ద సంస్థ ఇక్కడ తయారు అయిందంటే దానికి ఆత్మబలం కారణం. అన్యోన్య సహాయంగా ఉండే భక్తబృందం కూడా ముఖ్యమైన కారణం. అలా ఈ వర్గల్ అనేది ఒక అభివృద్ధి మోడల్.



అభివృద్ధి మోడల్ అంటే ఒక గ్రామాన్ని నగరం చేయగలగడం. వాటికగా ఉండే వర్గల్ యజ్ఞవాటిక అయ్యింది. యజ్ఞవాటిక అని జొన్నవాడ కామాక్షమ్మవారి గుడికి పేరు. మన హిందూధర్మానికి యజ్ఞవాటికని తయారు చెయ్యడానికి సత్సంకల్పంతో ఈ రోజు ఇక్కడ ధర్మం, శాస్త్రం విషయంలో బోధన జరుగుతోంది.

జయేంద్ర సరస్వతీ స్వామివారు చెన్నైలో జరిగిన సభలో ఒక ఘనపాఠీగారికి 'రాష్ట్రపతి పురస్కారం' వచ్చిన సందర్భంగా ఒక విషయం చెప్పారు. సభకి నూటయాభైమంది పండితులు వచ్చారు. పండితులకు సందేశమిస్తూ 'మీరు సమయానికి వెళ్ళి యాగం చేయించటంతో పని పూర్తి అయ్యింది అనుకోవద్దు. ఆ గృహస్థులతో నిత్యం మంచి సంబంధాలు పెట్టుకుని, నమక చమకాలు, సంధ్యావందనం, శంకరాచార్యుల స్తోత్రాలు నేర్పడం లాంటివి చేస్తూ ధర్మప్రచారకులుగా

ఉండాలి.' అని చెప్పారు. ఆ రోజుల్లో ప్రభుత్వం మాన్యాలవి ఇచ్చి శ్రోత్రియ గ్రామాలను వేదాలను, శాస్త్రాన్ని పోషించింది. మధ్యకాలంలో కొంచెం అది తగ్గి మహానదిలో నీరు తగ్గినప్పుడు ప్రవాహం వారగా వెళుతున్నట్టుగా ఉంది. ఇప్పుడు మరలా ప్రవాహం మొదలైంది. ప్రవాహం పెద్దదయినప్పుడు సమాజసేవలో ఉండే వారందరికి కూడా సన్మాన కార్యక్రమం జరుగుతుంది.

ఇక్కడ ఉన్నవారిలో శ్రీనివాస ఘనపాఠి – ఆయన, ఆయన బంధువర్గం కూడా ఈ వేదపాఠశాలలో ఉంటారు. గణేశ ఘనపాఠి – కంచిలో చదువుకొని ఇప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానం, చెన్నైలో ముఖ్య సూపర్‌వైజర్‌గా ఉండి, చాలామంది వేదపండితులని పర్యవేక్షించడం ప్రోత్సహించడం సమన్వయ పరచడం వంటి విషయాల్లో కార్యక్రమాలు చేస్తున్నారు. వాళ్ళ అబ్బాయికూడా చిన్నవయస్సు నుండే గోసేవ చేస్తున్నాడు.

ఇక తర్వాత కందుకూరి నారాయణశాస్త్రి. (నారాయణ యజ్వా) ఈయన వేదం, శాస్త్రం చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాన్ని మానేసి ఇక్కడ



పర్యవేక్షణలో ఉన్నారు. అందుకని ఇక్కడ వర్గల్‌లో అమ్మవారి సన్నిధిలో ఆయనకి సన్మానం చేయటం జరిగింది. వాళ్ళిద్దరు అబ్బాయిల్ని కూడా వేదపండితులుగా తయారుచేసి శాస్త్రాలు నేర్పిస్తున్నారు.


తర్వాత సీతారామశాస్త్రి. ఈయన తంజావూరు నుంచి వచ్చారు. వీరి అల్లుడు ఒకరు ఇక్కడే ఉన్నారు. ఇంకొక అల్లుడు సూర్యనారాయణ ఘనపాఠి అని ఋగ్వేదంలో తెలంగాణాలో ప్రసిద్ధ పండితుడు. ఈయన వరంగల్‌లో కూడా సంహితహోమము చేశారు. ఇప్పుడు శంకరమఠంలో మన స్వామివార్లు పాదుకా ప్రతిష్ఠ చేసిన సన్నిధిలో సత్సంతానం కోసం పురుషసూక్త హోమాలు చేయించడం వల్ల చాలామందికి మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈయన కాశీకి వెళ్ళి వక్త – శ్రోత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఋగ్వేదంలో మంచి ఘనపాఠి. ఆయన మామగారు ఇది వరకు ఢిల్లీలో ఉండి అక్కడ కొంత సంస్కృతం, జ్యోతిష్యం ప్రచారం చేశారు. ఇపుడు ఋషి – కృషి అని ఒక ఉద్యమం ప్రారంభించారు. ఒక సమయంలో ద్రవిడదేశంలో ఇరవైశాతం భూమి దేవాలయానికి కాని బ్రాహ్మణులకి కాని చెందినదై ఉండేది. అంతా భూస్వాములుగా ఉన్న సమయం. కనుక గ్రామంలో ఉండి వ్యవసాయం చేసుకొని దేవతార్చన, అధ్యయనం, అధ్యాపనం చేస్తూ ఒక అగ్రహారవ్యవస్థలో కుటుంబాలు ఉండేవి. 'మీరు ఇల్లు, భూమి అమ్మవద్దు, గ్రామాలు వదిలిపెట్టి రావద్దు' అని మహాస్వామివారు చెప్పేవారు. ఎంత మంచి మాటలు చెప్పినా మనకు సాధ్యమైంది, అనుకూలమైంది మనం చేస్తాం. అదే మనలో ఉండే కొంత లోపం అనుకోవచ్చు. మహాస్వామివారి ఉద్దేశ్యాన్ని కార్యరూపంలో తీసుకొనిరావాలని 'ఋషి ఏవం కృషి' అని ఒక కార్యక్రమం పెట్టి ఒక ఎకరమో రెండు ఎకరాలో బ్రాహ్మణుల భూమి తీసుకుని దానిమీద ఆదాయంతో వేదపాఠశాల, అధ్యయనం చేయిస్తున్నారు. శిష్యులను కంచిమఠంలో ఉండే సేవాకార్యక్రమాలకు పంపిస్తున్నారు. అంటే పాండిత్యము ఉండటము అనేది ఒకటైతే సేవ అనేది మరొకటి. పాండిత్యం ఉన్నవారు వారు పౌరోహిత్యం చేసుకుంటారు. పీఠంలో గంధం తీయడం, నైవేద్యానికి వంట, బిల్వం, నీరు తీసుకురావడానికి పరిచర్యలు చేయడానికి శిష్యుల్ని ఇక్కడికి పంపించారు.

ఆ రోజుల్లో గాంధీగారు రామరాజ్యం – గ్రామరాజ్యం – అదే స్వరాజ్యం అని చెప్పారు. తంజావూరు ప్రక్కనున్న గ్రామంలో రైస్‌మిల్లు, ప్రింటింగ్ టెక్నాలజీ, చిన్న స్కిల్స్ డెవలప్‌మెంట్ చేసి వ్యవసాయం చేస్తూ నివసించి, వేద అధ్యాపనం చేయించేవారు. జ్యోతిష్యంలో ఆయనకి పాండిత్యం ఉంది కనుక తద్వారా ఫ్యామిలి ఫ్రెండ్ అనే ఒక పత్రిక నడుపుతున్నారు. ఒక వృద్ధాశ్రమం మొదలుపెడుతున్నారు. మనదేశంలో

గ్రామాలు ప్రధానం. ఎంప్లాయిమెంట్, ఎథిక్స్, ఎన్విరాన్‌మెంట్ ముఖ్య ఉద్దేశ్యంగా ఆయన పని చేస్తున్నారు. వారికి ఇప్పుడు సత్కారం జరుగుతుంది.

తర్వాతివారు మణికంఠశాస్త్రి. ఆయన ఇక్కడకు రాలేదు. తిరుగోకర్ణం అని ఒక క్షేత్రం ఉంది. అది ఒక పాత సంస్థానం. బృహదంబదాస అని అక్కడ ఉండే రాజులు వ్రాసుకుంటారు. ఈ దేశంలో రాజులు ఒక భగవంతునికి దాసునిగా తనని తను చెప్పుకోవటం 'సదాసేవై'ఉ ంటుంది. పాతగుళ్ళల్లో ఒక రాజు యొక్క బింబం ఉంటుంది. (ద్రాక్షారామంలో చూసాము). వారు ఆ గుడిని కట్టించిన వారై ఉ ంటారు. భగవంతుడిని సేవించే భక్తుల పాదస్పర్శ ఆలయ నిర్మాతకు కూడా తగిలేటట్లుగా నిర్మిస్తున్నారు. ఇపుడు స్కందగిరిలో కూడా కుంభాభిషేకం చేసినప్పుడు అక్కడ ఒక సదాసేవై అని ఒక విగ్రహం పెట్టించారు. (ధ్వజస్తంభం ప్రక్కన) అలా అక్కడ బృహదంబదాస అని చెప్పుకుంటారు. తిరువనంతపురంలో పద్మనాభదాస అని చెప్పుకుంటారు. గోకర్ణం దగ్గర భైరవశాస్త్రిగారు అని ఒకరుండేవారు. శ్రీవిద్య ఉపాసకులు. ఆయనని మేము కాశ్మీరు పంపించాము. ఇరవై సంవత్సరములకు ముందు అక్కడకి వెళ్ళి దేశ భద్రతకోసం పూజలు, హోమాలు చేసి సైన్యాధికారులందరికి ప్రసాదాలు పంచారు. వారి అబ్బాయిని సిక్కిం పంపించాము. దేశక్షేమం, సురక్షణ కోసం 1980 ప్రాంతంలో ప్రాగ్జోతిష్యపురంలో – (కామరూపం) ఇబ్బంది ఉంటే మన చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారు ఇక్కడ నుండి కొందరిని పంపించి శాంతి కోసం రుద్రహోమాలు, చండీహోమాలు చేయించారు. అంటే ఇది మంత్రం ద్వారా మానవసేవ. ఈ సేవ చేస్తున్నందుకు మణికంఠశాస్త్రిగారిని సన్మానించడమైనది.

తరువాత విష్ణుభట్ల ఆంజనేయచైన్లుగారు. తెనాలిలో ఉండి రెండు అగ్ని ఉపాసనలు చేస్తారు. ఒకటి వైదికాగ్ని, (శ్రౌతాగ్ని) రెండవది లౌకికాగ్ని. ఈయన అగ్నిహోత్రిగా ఉండి ఈ మధ్యకాలంలో మహమ్మారి వ్యాపించినప్పుడు తెనాలి ప్రజలందరికి, పేదలకు, పోలీసులకీ కూడా అన్నదాన ప్రసాద వినియోగం చేసి సమాజసేవ చేయడం గొప్పవిషయం. ఆంధ్రదేశంలో 'పాకయజ్ఞం' అని ఒక సమితి పెట్టమని చెప్పాం. అంటే వంట, పంట, ఘంట. పది ఎకరాలు ఉన్నా, అమ్మాయిని క్లర్కుకి ఇస్తారు కాని రైతుకి ఇవ్వడానికి సంకోచిస్తారు. పూజారికి అమ్మాయిని ఇవ్వాలి. ఇంట్లో ప్రసాదాలు చెయ్యాలి. పూర్వకాలంలో మనం చేసిన ఆచారాలన్ని సిగ్గు, లజ్జ లేదా బయట గౌరవం లేదని మనం అనుకున్న భావన చేత ప్రస్తుతం ఆచరించడం లేదు. దీనిలో ఇప్పుడు మంచి టీమ్ తయారుచేసి విశాఖపట్టణం శంకరమఠంలో ఉండగా 50రోజులు



వచ్చిన వాళ్ళందరికీ కూడా వారికి తగిన విధంగా, ఎవరికి ఇబ్బంది కలుగకుండా, శాస్త్రానికి ఇబ్బంది లేకుండా ప్రసాద వితరణ జరిగింది. పార్వతీ కల్యాణంలో ఒకమాట చెబుతారు. 'సంభావయామాస యథా ప్రధానం' ఆ పెళ్ళికి చాలమంది వచ్చారు. వచ్చిన వారిని గౌరవించాలి. అందరిని ఒకేరకంగా గౌరవించడం సాధ్యమా ? సముచితమా ? కాని ఎవరైన సరే వచ్చిన వాళ్ళందరిని గౌరవించాలి. పరమేశ్వరుడు పెళ్ళైన తరువాత ఒక్కొక్కరిని ఒక్కొక్క విధంగా గౌరవించాడుట. 'కంపేన మూర్ధ్నః శతపత్రయోనిం' తలవంచి పురోహితుడైన బ్రహ్మకు నమస్కరించి గౌరవించారు. 'కంపేన మూర్ధ్నః శతమత్ర యోనిం' 'వాచాహరిం' – మహావిష్ణువును మంచి మాటలతో స్వాగతించి గౌరవించారు. 'వృత్రహణం స్మితేన' – ఇంద్రుడుతో మాటలు లేవు కాని చిరునవ్వుతో రావయ్యా అని మంచిగా చూశారు. 'ఆలోక మాత్రేణ సురానశేషాన్' దేవతలు అందరిని చూశారు. 'సంభావయామాస యథా ప్రధానం' వారి ప్రాముఖ్యత ప్రకారం గౌరవించారు. అలా ఆకలి, దాహం లేని లోకం మనకి కావాలి. 'అశనాయా పిపాసే' అని మన శాస్త్రంలో ముఖ్యంగా చెబుతారు. అలాగే విశాఖపట్టణంలో అర్ధరాత్రి అయినా కూడా ద్వారకానగర్ లో వచ్చినవాళ్ళకి అందరికీ కూడా ప్రసాదాలు అందించడం జరిగింది. అంటే భగవంతుడిని గుడిలో దర్శించడం ఒకటైతే భక్తుడి కడుపు నిండినప్పుడు ఆ భగవతత్త్వాన్ని సందర్శించడం మరొకటి. పాకయజ్ఞం అనే విషయంలాగా అనేక యజ్ఞాలు ఉన్నాయి. పంచయజ్ఞం అనేది ఉన్నది. 'పంచసంఖ్యోపచారిణి' అలాగే 'పంచయజ్ఞప్రియ' అని ఉంది. పంచయజ్ఞాల్ని ప్రచారం



చేయడానికే 'వేద ధర్మ శాస్త్ర పరిపాలన సభ' అని 1942 సంవత్సరము శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామివారు స్థాపించారు. ఇప్పుడు ఆంధ్రదేశంలో కూడా దానిని ప్రచారానికి తీసుకువస్తున్నాము. తద్వారా ఇక్కడ కూడా ప్రవచనాలన్ని పెట్టిస్తాము. ఈ సభలో ఉపనయన మంత్రార్థాలు, వివాహ మంత్రార్థాలు, బ్రహ్మైక్యం అంటే ఏమిటి? వైశ్వదేవం అంటే ఏమిటి? సీమంతం అంటే ఏమిటి? జాతకర్మ, నామకరణం, జాతకర్మ ముందున్న సంస్కారాలు, వాటి తాత్పర్యం, భావార్థం నేర్పించడం ద్వారా మన హిందువులందరూ కూడా వారి జీవితంలో వారు చేస్తున్న ఈ సంస్కారాలన్నింటికి దైవ అనుగ్రహం పొందే అవకాశం ఉంటుంది.

(ఇప్పుడు ద్వారకతిరుమల ప్రక్కన, పశ్చిమగోదావరి జిల్లాలో ఒక స్థలము, భవనము ప్రజాసేవకి వాడుకోండి అంటే 'ప్రసాద పాఠశాల' అని ఒక సంకల్పం చెప్పి ఆ బాధ్యత ఆంజనేయచైన్లుగారికి ఇవ్వడం జరిగింది.) అలా వారి కుటుంబ సభ్యులందరూ కూడా స్వామివారి మీద భక్తితో యజ్ఞశాల నిర్మాణం చేసుకొని చంద్రశేఖర యజ్ఞశాల అని పేరు పెట్టుకొని, అగ్నిహోత్రాలు చేస్తూ అక్కడక్కడ సమిష్ఠిగా, అనుష్ఠాలను చేసి ఇప్పుడు అధికమాస ప్రయుక్తంగా శ్రీరంగంలో మరియు ఉడిపి క్షేత్రంలో చేస్తున్నారు.

చంద్రమౌళీశ్వర క్షేత్రం ఉడుపి. 'ఉడు - పతి' అనేది ఉడుపి అయ్యింది. 1973లో మన జయేంద్ర సరస్వతి స్వామివారు ఉడుపికి వెళ్ళారు. అక్కడ అష్టమఠాలు ఉంటాయి. రెండు సంవత్సరముల కొకసారి వాళ్ళు పర్యాయ కృష్ణపూజ చేస్తారు. మన స్వామివారికి సత్కారం చేసినప్పుడు ఆయన వారితో చెప్పారు, 'ఉడుపి మాకు క్రొత్తది కాదు. ఉడుపి అంటే ఉడుపతి అని అర్థము. ఉడుపతి అంటే చంద్రమౌళీశ్వరుడు'. కృష్ణ భగవంతుడి యొక్క కృష్ణ పరమాత్మ గుడి ప్రక్కనే ప్రాచీనంగా ఒక శివాలయం ఉంది. ఆ శివాలయంలో పూజ చేసిన తరువాతనే కృష్ణపరమాత్మకు వాళ్ళు పూజ చేస్తారు. మాకు పూర్వ సంబంధం ఉందిక్కడ, అందుకని ఇక్కడకు రావటం మాకు చాలా సంతోషం అని చెప్పారు. (ఉడుపిలో కూడా మన మద్దెలపల్లి దత్తాత్రేయశాస్త్రిగారి ద్వారా భాగవత సప్తాహం, తర్వాత జంబుకేశ్వరంలో, కంచిలో తంగిరాలవారి ద్వారా అధికమాసం అనేది జరుగుతుంది. 'త్రయస్త్రింశత్ అపూపకాన్' - ఒక ఇత్తడి లేదా కాంస్యపాత్రలో ముప్పైమూడు అపూపక నివేదనం స్వామికి చేస్తారు. ఆ పాత్రను ఒక బ్రాహ్మణుడికి అది ఇవ్వడం జరుగుతుంది.) అధికమాసంలో 30రోజులపాటు ప్రతిరోజు అగ్నిహోత్రం, (శ్రౌతాగ్ని) లౌకికాగ్ని అనే వంట ఈ రెండు విషయాల్ని చేస్తూ, ప్రజాసేవ కూడా చేస్తూ భక్తి ప్రచారాలన్ని హరిద్వార్ భద్రాచలం మరియు అనేక ప్రాంతాలలో చేసి ఈ సంవత్సరం ఉడుపి, శ్రీరంగం మొదలైన ప్రాంతాలలో చేయదలచుకున్నారు. అలా సమాజసేవ కూడా జరుగుతున్నది.

తరువాత జనార్ధన శ్రౌతి. మాదిరిమంగలం అనే పాతగ్రామం చాలా ఆచారం, అనుష్ఠానం కలిగినది. వారి భావం, దృష్టిలో కూడా ఆచారం అనుష్ఠానం ఉంటుంది. వాళ్ళు శాస్త్రాన్ని వారి రీతిలో ఆచరిస్తూ ఉంటారు. అక్కడ ధర్మశాస్త్రం, (హిందూ లా) బాగా చదువుకొని చిన్న వయసులోనే నిష్ణాతులై ధర్మశాస్త్ర వివేచనం గురించి చెప్తూ బాగా చేస్తున్నారు. ఈ రోజుల్లో ధర్మశాస్త్రాన్ని కొన్ని సందర్భాల్లోనే అడగడం జరుగుతోంది. అలా కాకుండా మామూలు రోజుల్లో కూడా మనం అడిగి తెలుసుకునే విధంగా ఉండాలి. ఆ ధర్మశాస్త్రం అందరికీ మంచి విషయాలు నేర్పాలి. ఏదో భయం, సంకటం, సందేహాలు వచ్చినప్పుడే ధర్మశాస్త్రం అని కాకుండా విషయాలన్నీ కూడా అందంగా చెప్తూ, అందుబాటులో ఉండాలి. ధర్మశాస్త్రంలో ఉండే లలితమైన విషయాలు, లఘున్యాసాలు, లాఘవంగా మనం చేయాల్సిన విషయాలేముంటాయో అవన్ని చెప్పాలి. దాంట్లో భీతి కలగకుండా మంచి ఆకర్షణగా ధర్మశాస్త్ర



ప్రచారము జరగాలి. దానికోసం ధర్మశాస్త్ర పండితులకి ఈ సత్కారం జరుగుతోంది.

తర్వాత రమణశర్మ. ఆయనకు విదేశీ జ్ఞానం ఉంది. నగరంలో నివాసం చేసిన మనిషి. మన జయేంద్ర సరస్వతి స్వామివారి ఆదేశానుసారం కావేరీతీరంలోని చిన్న గ్రామానికి వెళ్ళి గత 17 సంవత్సరాలుగా అక్కడే కావేరి స్నానం చేసుకొని అగ్నిహోత్ర అనుష్ఠానం చేసుకొని కర్పూరం విద్య నేర్చుకొన్నవారు. విద్యారణ్యభాష్యం, యజుర్వేదం పూర్తిగా అర్థం చేసుకొని చెప్పగలిగే స్తోమత ఉన్నది. ఇంకా కంచిపీఠం, శంకరాచార్య చరిత్ర ఇలాంటి అనేక విషయాలలో ఇతిహాసక (హెరిటేజ్ హిస్టరి) జ్ఞానం కలిగినవారు. వారి తల్లిదండ్రులు ఇద్దరూ కూడా డాక్టర్స్. వారు అగ్ని ఉపాసన చేస్తారు. అది ఒక మంచి విశేషం. మంచి సంకల్పాలు కలగాలంటే కుటుంబంలోని సంస్కారంతో అది సులభంగా, సహజంగా జరుగుతుంది. దానికోసం ఈ రమణశర్మగారికి బిరుదును ఇస్తున్నాము. ఆయన మన కృష్ణమూర్తిశాస్త్రిగారికి తోడుగా ఉండి వీరికందరికి సహకారం చేస్తూ ఉంటారు.



ఇక ఈరోజు ఎవరైతే అధ్యక్షులుగా వచ్చారో మహామహోపాధ్యాయ, ఈయన కూడా ఆ రోజుల్లో ఒక శాస్త్ర కారణం చేత ముఖ్యపదవిలో ఉన్నా, అక్కడి నుండి తిరుమల తిరుపతి దేవస్థానంలో ఒక సంవత్సరం ఉండి అక్కడ కూడా పదవీ విరమణ చేశారు. మన జయేంద్రస్వామివారి అభిప్రాయం ప్రకారం ధర్మం, శాస్త్రం ముఖ్యం అని (సంస్కృత కళాశాలకు) వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. తర్వాత ఇంకా పెద్దపదవి వచ్చింది. ఆ రోజుల్లో జీతాలు జీవితానికి ముఖ్యం అనే భావనని త్యజించడం సాహసోపేతమైన విషయం. సాహసమైన విషయాన్ని సహర్షంగా చేసిన వ్యక్తి కృష్ణమూర్తిగారు. వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు స్వామివారు వదిలేయమని చెప్తే వదిలేశారు.

తరవాత భరణీధరశాస్త్రి. ఈయన కంచిమఠం పురోహితులు. చంద్రశేఖరశాస్త్రిగారి దగ్గర విద్యాభ్యాసం చేసి ఋగ్వేదం సంపూర్ణంగా చదివినవారు. చిన్నవయస్సు నుంచి మఠంలో పెరిగిన వ్యక్తి. కంచిలోని దండపాణి ఓరియంటల్ స్కూల్లో లౌకికవిద్యను అభ్యసించి, తరవాత వేదాధ్యయనం పూర్తి చేసి, వేదం, వ్యాపారం, ధర్మప్రచారం చేసి కష్టపడి పైకి వచ్చిన కుటుంబం. లౌకికంగా, ధర్మపరంగా క్రొత్త విషయం తెలుసుకోవడంలో ఆసక్తి ఉన్నవారు. వేద, శాస్త్ర, శ్రౌత, ధర్మ, శాస్త్రపండితులు అందరితో సత్సంబంధాలు కలిగి ఉండేవారు. వారి యొక్క అధ్యాపకులు చంద్రశేఖరశాస్త్రిగారి తండ్రి అప్పుకుట్టిశాస్త్రిగారు కూడా మఠం పురోహితులే. వారి దగ్గర నేర్చుకున్న అనుభవం వల్ల పీఠం, పీఠ కార్యక్రమమే ముఖ్యం అనే విషయాన్ని మనసులో గ్రహించి, వృత్తి, కుటుంబ పరిరక్షణ బాధ్యత ఉన్నా పీఠం కోసమే పనిచేయాలి అనే తత్వాన్ని పెంచుకొన్నారు. ఇప్పుడు 'వేద ధర్మ శాస్త్ర పరిపాలన సభ'కి ముఖ్య ప్రోత్సాహకుడిగా ఉండి మంచి కార్యక్రమాలు చేస్తున్నారు.

కాశ్మీర్ లో 15 సంవత్సరాల క్రితం విశ్వశాంతి యజ్ఞం చేయాలని సంకల్పించినప్పుడు మన జయేంద్ర సరస్వతి స్వామివారు కూడా స్వయంగా అక్కడి శంకరాచార్య హిల్ (250 మెట్లు పైకి వెళ్ళి అభిషేకం చేసి వచ్చారు). ఒక తెలుగు పెద్ద ఆఫీసర్, పల్లకి పెట్టి అన్ని ఏర్పాట్లు చేశారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పంచమి, అక్షయ తృతియకి రెండు రోజుల ముందు అక్కడ ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణ వేదాలలో ఒక వేద పారాయణం జరిగి అగ్నిహోత్రం ద్వారా ఇష్టి జరుగుతుంది. కచేరీలూ ఏర్పాటు అవుతాయి. దేశానికి, ధర్మానికి మంచి జరగాలి అనే సంకల్పం వ్రాసి, ఆ సంకల్పం చదివి ఈ విశ్వశాంతి యజ్ఞం జరుగుతుంది. అది ప్రారంభం చేసినప్పుడు ధైర్యంగా కాశ్మీర్‌కి వెళ్ళి ఆ హోమాన్ని శాస్త్రిగారు చేయడం, దానిని వీడియో ద్వారా మన స్వామివారు చూసి విశేషంగా ఆశీర్వచనం

ఇవ్వడం, ఇలాంటివన్నీ జరిగాయి. ఇప్పుడు సులభమైన తరువాత పదిమంది వస్తున్నారు అనుకోండి. ఇప్పుడు శంకరమఠం కట్టిన తరువాత ఈ కార్యక్రమం చేసుకుంటాం అని వచ్చేవారుంటారు. కాని సంకల్పాలు చేస్తున్నప్పుడు ప్రారంభంలోనే ధైర్యంగా, నమ్మకంగా రావటం అనేది మంచి విషయం. అలా కాశ్మీర్ కోసం వెళ్ళి, విద్యారంగంలో, ధర్మప్రచారంలో అనేక కార్యక్రమాలు చేస్తున్న వారికి ఇక్కడ సన్మానం చేస్తున్నాము. ఇంకొక విషయం ఏమిటంటే వారికి ముగ్గురు ఆడ సంతానం తరువాత మగపిల్లవాడు. జయేంద్ర సరస్వతీ స్వామివారి ఆశీర్వాదం వల్ల పుత్ర సంతానం కలిగింది. ఆ పిల్లవాడికి వేదాధ్యయనం ఈయనే స్వయంగా చేయించారు.

1933-34 సంవత్సరాలలో ఇక్కడ పాత నిజాం పరిపాలనలో పరమాచార్యులవారు పల్లకిలో పర్యటించారు. అప్పుడు 40, 45రోజులు హైదరాబాద్‌లో ఉన్నారు. కాచిగూడా పాతసత్రంలో వారు విడిది చేసిన గది కూడా మేము చూసి వచ్చాము. అక్కడ ప్రతి అనూరాధ నక్షత్రం రోజున సభ చేయమని చెప్తే, అది కూడా ప్రారంభం చేశారు. అప్పట్లో స్వామివార్లు వస్తుండగా ఆ క్యాంప్‌ను సంచరిస్తున్న నగరం అనేవారు. (మూవింగ్ టౌన్) అంటే వంద ఎద్దుల బండ్లు ఉండేవి. ఒక దానిలో సింహాసనము, మరోదానిలో పీఠ పూజా సామగ్రి, ఇంకొక దానిలో వంటవాళ్ళు, మరొకదానిలో సన్నాయివాళ్ళు ఉండేవాళ్ళు మరోబండిలో వేదపాఠశాల అధ్యాపకులు వస్తుంటారు. అక్కడే పాఠాలు జరిగేవి. స్వామివారు మధ్యలో పల్లకి దిగి రెండు బళ్ళ మధ్య నడిచేవారు. అది ఎవరికీ తెలిసేది కాదు. అట్లా అందరినీ తీసుకెళ్ళి కాశీయాత్ర చేయించారు. అప్పుడు యాత్రలో కూడా వేదపాఠశాల జరిగింది. అలా ఇన్ని కార్యక్రమాల మధ్యలో కూడా శాస్త్రిగారు వారి అబ్బాయికి వేదం నేర్పించారు. గొప్ప విషయం అది.

తరువాత చంద్రశేఖర ఘనపాఠి. ఈయన మన తెలంగాణ ప్రాంతంలో ఎన్నో వేదపాఠశాలలు పెట్టడానికి ప్రోత్సాహం కలిగించిన వేదభవన్ వెంకట్రామ ఘనపాఠిగారి శిష్యుడు.

తరువాతవారు అంబిఘనపాఠిగారు అని కంచిలో ఉండేవారు. సాత్వికులు. 40 సంవత్సరములు కంచిలో వేదపఠనం చేయించారు. వారి తండ్రిగారు 19 సంవత్సరాల వయస్సులో అధ్యాపకుడయి మనక్కాల్ ఘనపాఠిగా 70 సంవత్సరాలు నేర్పించి పెద్ద పెద్ద ఘనపాఠీలను తయారు చేశారు. అంబిఘనపాఠిగారు తండ్రిగారి దగ్గర జట, ఘనం అన్నీ నేర్చుకున్నారు. క్రమాంతం ఇక్కడ నేర్చుకున్నారు. కంచిమఠంలో ప్రారంభం చేసిన వేదపాఠశాలలో అధ్యాపకుడిగా ఉండి, వేదపాఠశాల జరుపుతూ, గో - వేద ఫౌండేషన్ పెట్టుకొని చక్కగా



విద్యార్థులని తయారు చేస్తున్నారు. ఈ సంవత్సరం ఈయన దగ్గర చదువుకున్న విద్యార్థులు మంచి హైర్యాంక్‌లో పాసైనారు. ఇప్పుడు ఆయనకి కొన్ని సామాజిక సేవాకార్యక్రమాలు మేము ఇచ్చాము. దక్షిణదేశంలో ధర్మం ఆచరణలో ఉంది. మనం ఎక్కడ బావుందో అక్కడ చూస్తూ ఉంటే అంతా బానే ఉన్నట్టు ఉంటుంది. కాని ఎక్కడ ఎలా చూడాలో అలా చూస్తే మనకన్నీ తెలుస్తాయి. శంకరాచార్యులవారు ఎక్కడ నుంచి వచ్చారో అక్కడ కూడా చూడాలి కదా! మూలస్థానం ఎక్కడ ఉందో అక్కడ పుష్టి కావాలి. దానికోసం కేరళరాష్ట్రంలోని పరశురామ క్షేత్రంలో ఆయనకి కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు ఇచ్చాము. ఆయన బెంగుళూరు నుండి చక్కగా సౌందర్యలహరి, నారాయణీయం పారాయణ చేసే మహిళామండలివారిని తీసుకెళ్ళి అక్కడ పారాయణం చేయించారు. ఎక్కడ నమ్మకం కలిగినవారి సంఖ్య తక్కువ ఉందో, ఎక్కడ దుర్బలత్వం కనిపిస్తుందో, ఎక్కడ కొంచెం ధైర్యం చేయడం సులభం కాదో, అలాంటి చోట వెళ్ళి సత్సంగాలు చేస్తూ, కేరళ దేశంలో ఇప్పుడు నెలకు 5, 6 కార్యక్రమాలు చేస్తున్నారు. తిరువనంతపురంలో సముద్రతీరంలో ఒక పౌర్ణమి రోజు లలితా సహస్రనామ యజ్ఞం చేసి ఇంకా మనప్పుఅంలాంటి ఇంకొన్ని చోట్ల



ప్రయత్నం చేస్తున్నారు. ధర్మప్రచారం ప్రజాబాహుళ్యం ఉన్న చోట చెయ్యడం వేరు, ఎక్కడ గ్లాని కనిపిస్తుందో అక్కడ మన ఉద్యమం గట్టిగా చెయ్యాలి. దానికోసం పరశురామ క్షేత్రంలో కంచిపీఠం తరఫున ఇప్పుడు 'అర్చక సంక్షేమం' అని ఒక పథకం జరుగుతోంది. ఆ పథకం క్రింద గ్రామీణ అర్చకులకు కొంత సహకారం చేయడం జరుగుతోంది. శంకరాచార్యుల జన్మభూమి కాలడి ప్రక్కన పదిగ్రామాలను తీసుకొని ప్రతినెలా 3వేలు పంపిస్తూ పదిగుళ్ళల్లో అర్చకులు ఉండేలా ప్రోత్సహిస్తున్నాము. అంటే శబరిమలై, గురువాయూరు, చోటానికరై ఇంకా ప్రసిద్ధ దేవస్థానాలకి జనం వెళ్తారు. అక్కడ వెండి కవచాలు, బంగారు కవచాలు అన్నీ చేయిస్తూనే ఉంటారు. గ్రామంలో, పల్లెటూర్లో ఉండే దేవస్థానాల పూజలు, అక్కడే ఉండే అర్చకుల సంక్షేమం మనం ముఖ్యంగా చూడాలి. అదే ఉద్దేశ్యంతో కేరళలో చేస్తున్నాము. తిరుమలలో సహస్ర కలశాభిషేకం చేస్తారు. చాలా సంతోషం. కంచికామాక్షి అమ్మవారి గుడిలో కూడా సహస్ర కలశాభిషేకం నవరాత్రి తరువాత జరుగుతుంది. బంగారంతో చేసిన కలశాలు ఉంటాయి. ఈయన ద్వారా ప్రాచీన గ్రామ దేవాలయాలలో వెయ్యి మట్టి కలశాలతో సహస్ర కలశాభిషేకం, వేదపారాయణం చేయించి మన గ్రామంలో కూడా సహస్రకలశాభిషేకం జరిగింది అనే సంతోషం కలిగేటట్టు చేయాలని ఉద్దేశ్యం. మా ఉద్దేశ్యం సంవత్సరంలో ఒక్కసారైనా ఋగ్వేద, యజుర్వేద, సామవేదాలలో ఏదైనా ఒక వేదం మూల పారాయణం గుడిలో జరగాలి. తద్వారా చైతన్యం, సాన్నిధ్యం పెరుగుతుంది. ఆధ్యాత్మికశక్తి పెరుగుతుంది. (ఇప్పటి రోజుల్లో జడమంతా చైతన్యవంతం అయ్యింది. స్విచ్ నొక్కితే అది సమాధానం చెప్తుంది. ఇంకా దానిలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అని క్రొత్తగా విజ్ఞానం కూడా వచ్చింది.)

మనం ఏ మంచి పనులు చెయ్యాలో అవి చేస్తూ ఉండాలి. వీరు అందరూ సేవచేయడం, మరియు ఘనపాఠీలు అవ్వడం విశేషం. ఈరోజు ఇక్కడకి వచ్చిన వాళ్ళు, సత్కారం చేయబోతున్నవాళ్ళు అందరూ చదువుకున్నవాళ్ళే. చదువు కోసం చేసే సత్కారం వేరు. చదువుని ఎలా వినియోగిస్తున్నారు? సమాజహితం కోసం ఎలా పనిచేస్తున్నారు అనేదే ఇక్కడి విషయం. చంద్రశేఖర ఘనపాఠిగారి యొక్క తాతగారు కంచి ప్రక్కన కలవై అనే ఊరిలో ఉండేవారు. మన మహాస్వామివారి గురువులు మహాదేవేంద్ర సరస్వతీ స్వామివారు ఆయనకు గురువుగారు. మహాస్వామివారే వీరికి ఆ పేరు పెట్టడం జరిగింది. అలా ఉభయ గురువుల అధిష్ఠానాలు అక్కడ ఉన్నాయి. అప్పుడప్పుడు మహాస్వామివారు వెళ్ళి అక్కడ ఏకాంతంగా ఉండేవారు. కలవైలో అర్చకులుగా అప్పయ్య దీక్షితులు వంశస్థులు నాగరత్న దీక్షితులు అనే

ఆయన 45 సంవత్సరములు పైన పూజ చేశారు. తరువాత అర్చకులుగా 45 సంవత్సరములు రామకృష్ణ దీక్షితులు యొక్క బంధువు పనిచేశారు. ఆ తరువాత అర్చకులు చంద్రశేఖరఘనపాఠిగారి తాతగారు. వారు మన జయేంద్ర సరస్వతీ స్వామివారి గోత్రీకులు. ఆయన కలవైలో అధిష్ఠానంలో 30 సంవత్సరములు పూజ చూసుకునేవారు. వేదపండితులైనప్పటికీ స్వామివారు అదేశం ప్రకారం అక్కడే స్థిరపడ్డారు. అంటే సమాజసేవకులుగా వేదపండితులని కొందరిని తయారు చేయటం మన ఉద్దేశ్యం. చంద్రశేఖరఘనపాఠిగారి తండ్రిగారు కేరళ ఎర్నాకులం దగ్గర సమూహమండలంలో ప్రధాన పురోహితులుగా ఉన్నారు.

అప్పట్లో చంద్రశేఖరశాస్త్రి తమ్ముని కొడుకు రామగోపాల్‌జీ అని ఒకాయన, బ్రహ్మచారిగా ఉండి నిత్యం సహస్రగాయత్రి చేసేవారు. ఆయన ఆర్.ఎస్.ఎస్ లో చాలా ప్రసిద్ధం. ముఖ్యంగా తమిళనాడులో హిందూగుళ్ళని హిందూమత ప్రచారం కోసం ప్రధానంగా ఉండేలా తయారుచేశారు. సంస్థాపక అధ్యక్షుడిగా, ఫౌండర్‌గా, చైర్మెన్‌గా ఉండి జాతరలు, గణేశ ఉత్సవాలు మన పద్ధతి ప్రకారం చేయడానికి ఉద్యమం చేశారు. అలా చేసే సమయంలో చాలా ఇబ్బందికి కూడా గురయ్యారు. మధురైలో ఒక రైల్వేస్టేషన్‌లో ప్రత్యక్షంగా దాడికి గురయ్యారు. ఒకసారి వారు కంచి వచ్చినప్పుడు స్వామివారు ప్రత్యేకంగా ఆశీర్వచనం ఇచ్చారు. ఆ తరువాత అనేక సంవత్సరాలు సమాజం కోసం చాలా సేవ చేశారు. శాస్త్రిగారి అన్న కొడుకులను కూడా స్వామివారి ఆదేశం ప్రకారం, వాళ్ళకి వ్యాపారాలు, లౌకిక స్వార్జితాలు ఉన్నా వేద పఠనం చేయించారు. శాస్త్రిగారి కొడుకు కూడా ఈ సంవత్సరం మంచి మార్కులతో పరీక్షలో ఉత్తీర్ణుడు అయ్యాడు. వీరు వేదం, శాస్త్రంతో పాటు కంచిపీఠంలో సేవకార్యక్రమాలు, అధిష్ఠానంలో సేవా కార్యక్రమాలు, మన పెద్దస్వామివారు పుట్టిన విల్లుపురంలో కార్యక్రమాలు బాగా చేస్తుంటారు.

వీళ్ళల్లో మొదటిగా శ్రీనివాస ఘనపాఠిగారికి సత్కారం. ధర్మం కోసం, సమాజం కోసం సేవ చేస్తున్న వాళ్ళని గౌరవిస్తే తద్వారా సమాజానికి బాధ్యత, అవకాశం, హితం ఉన్నాయని తెలియజేసినట్టు అవుతుంది. అలా సేవ చేస్తున్న వారిని ప్రోత్సహించడం కోసమే ఈ దీర్ఘ ప్రసంగం చేసింది.

ఈ కార్యక్రమంకోసం ప్రత్యేకంగా వర్గల్ వచ్చినవారు మన మహామహోపాధ్యాయులు కృష్ణమూర్తిశాస్త్రిగారు. చాలా మందికి



వేదభాష్యం నేర్పించి, వేద సప్తాహం అని క్రొత్తగా భాగవత సప్తాహంలాగా ప్రారంభించి ఇప్పటికే 15సప్తాహాలు చేశారు. వీరి తండ్రిగారు మంచి ఉపాసకులు, సాత్వికులు, అనుష్ఠాత. ఆ రోజుల్లో కొందరే ఘనపాఠీలు ఉన్నప్పుడు ఈయన ముఖ్యమైన ఘనపాఠిగా ఉండేవారు. స్వామివారికి మంచి భక్తుడు. వీరి తల్లిగారు కూడా మంచి సాత్వికం. ఇంత వయస్సులో కూడా అధ్యాపనం ముఖ్యమని రోజూ ఉదయం వేదం నేర్పిస్తారు. చాలా గొప్ప ప్రొఫెసర్ అయినా, సంస్కృత కాలేజీలో ఉదయం 5.30గం॥ వస్తే వారికి వేదం నేర్పిస్తారు. అదీ అధ్యాపకుడి ముఖ్య లక్షణం. చాల ముఖ్యం.

సూర్యనమస్కారాలు, రామాయణ పారాయణం చేయిస్తారు. మన పీఠం యొక్క శాస్త్ర పోషక సభల్లో పరీక్షాధికారి. పెద్ద వయస్సు వచ్చిన తరువాత ఒక స్ఫూర్తితో 'తెనాలి పరీక్ష'లో ఉత్తీర్ణులయ్యారు. వీరి అబ్బాయి ఐ.ఐ.టిలో గొప్ప ప్రొఫెసర్. సాంప్రదాయ బాహ్య చిహ్నాలైన కట్టు, బొట్టు, జుట్టుని పాటిస్తూ, ధైర్యంగా ఉండి, ప్రాచీన వేషభూషణాలతో ఐ.ఐ.టిలో ప్రొఫెసర్‌గా ఉండి శాస్త్రము, సైన్స్ చదువుకొని ఉన్నత స్థానంలో ఉన్నారు. వీరి దౌహిత్రులు కూడా ఉభయవిద్యలలో ఉండి ఈ సంప్రదాయంలో చదువుకున్న అమ్మాయిలనే పెళ్ళి చేసుకొన్నారు. వీరి సతీమణి కూడా సంస్కృత భాషలో చాలా కృషి చేశారు. ఆవిడ స్వయంగా సంస్కృతంలో మాట్లాడతారు. అలా ఈ దంపతుల ద్వారా ధర్మప్రచారం జరుగుతోంది. ఈయన ఖాళీగా కూర్చోవడం అరుదు. ఎప్పుడు పాఠం చెప్తూనో, ప్రవచనం చేస్తూనో ఉండాలి అనుకుంటారు. ఈ కార్యక్రమానికి 10 సంవత్సరములుగా అధ్యక్షుడిగా ఉండి, ఈ సంవత్సరం సభకోసం అక్కడ నుండి వచ్చారు. ముందు వీరికి సత్కారం జరుగుతుంది. తరువాత శ్రీనివాస ఘనపాఠిగారికి సత్కారం జరుగుతుంది.

**జయ జయ శంకర హర హర శంకర**



# శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి విజయయాత్రా విశేషాలు

## వారణాసిలో చాతుర్మాస్యదీక్షలో స్వామివారు




జులై 9వ తేదీ
స్వామివారి
సమక్షంలో
ప్రారంభమైన
ఘనపారాయణం




ఆగస్ట్ 24వ తేదీ
స్వామివారి
ఆశీస్సులతో
పూర్తయింది.





**ఆగస్ట్ 6వ తేదీ** వారణాసిలోని శివాలయ ఘాట్ వద్ద చేత్సింగ్ ఫోర్ట్‌లో వైభవంగా ఆహితాగ్ని సదస్సు జరిగింది. పండితులను స్వామివారి సమక్షంలో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా శ్రీ మోహన్ భగవత్‌గారు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అనేక ప్రాంతాల నుండి వేదపండితులు వచ్చి స్వామివారి ఆశీస్సులు పొందారు.







**ఆగస్ట్ 10వ తేదీ** వార్షిక పంచాంగ సదస్సు వారణాసిలోని చేత్సింగ్ ఘాట్ వద్ద స్వామివారి సమక్షంలో జరిగింది.





**ఆగస్ట్ 13వ తేదీ** విశేషంగా శాస్త్ర సదస్సు జరిగింది. పండితులకు స్వామివారి సమక్షంలో జ్ఞాపికలు అందించి, సన్మానించారు. వారు ఆ రోజున పాదపూజ, వైదిక భిక్షావందనము చేసుకున్నారు.



ఆగస్ట్ 15వ తేదీ వేద లక్షణసభ ప్రారంభమై ఆగస్ట్17వ తేదీ వరకు జరిగింది. ఈ సందర్భంలో స్వామివారు అనుగ్రహభాషణం చేసి వేదపండితులను సన్మానించారు.



ఆగస్ట్ 16వ తేదీ వారణాసిలో చేత్సింగ్ ఘాట్ వద్ద స్వామివారి సమక్షంలో కాశీ ఆర్ష సంస్కృతి గురించి సమావేశం జరిగింది.




**ఆగస్ట్ 20వ తేదీ** వారణాసిలోని చేత్సింగ్ ఘాట్ వద్ద బెంగాలీయుల సమావేశం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పాల్గొన్న భక్తులు స్వామివారికి జ్ఞాపిక బహూకరించి, ఆశీస్సులు పొందారు.



**ఆగస్ట్ 21వ తేదీ** స్వామివారి చాతుర్మాస్యదీక్ష సందర్భంగా వారణాసిలో చేత్సింగ్ ఘాట్ వద్ద రంగన్‌జీగారి (కృష్ణప్రేమిగారి పుత్రులు) భాగవత సప్తాహం ముగిసింది. వారిని స్వామివారు సన్మానించి, ఆశీర్వదించారు.



**ఆగస్ట్ 25వ తేదీ** వారణాసిలోని చేత్సింగ్ ఘాట్ వద్ద భగవద్గీత లేఖనం జరిగింది. పాల్గొన్నవారు స్వామివారి ఆశీస్సులు పొందారు.



స్వామివారి సమక్షంలో జరిగిన గుజరాతీ సమ్మేళనం









వారణాసిలో స్వామివారి చేతుల మీదుగా శ్రీ వై.ఎస్.ఆర్.మూర్తిగారు వ్రాసిన డివైన్ డైరెక్షన్‌తో పాటు ఆదిశంకర భగవత్పాద స్తోత్రము, శాంకరీ పరంపర, శివస్తుతి, లలితా భజనామృతము మొదలైన ఇతర ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ జరిగింది.

**ఆగస్ట్ 29వ తేదీ** వారణాసిలో శివాలయ ఘాట్ వద్ద స్వామివారి సమక్షంలో ఋగ్వేద ఉపాకర్మ జరిగింది.





ఆగస్ట్ 30వ తేదీ వారణాసిలో హనుమాన్ ఘాట్ వద్ద కామకోటీశ్వర ఆలయంలో స్వామివారి సమక్షంలో ఋగ్ సంహిత హోమం, పూర్ణాహుతి జరిగింది.





ఆగస్ట్ 30వ తేదీ వారణాసిలో శివాలయ ఘాట్ వద్ద స్వామివారి సమక్షంలో యజుర్వేద ఉపాకర్మ జరిగింది.



ఆగస్ట్ 30వ తేదీ వారణాసిలోని శివాలయ ఘాట్ వద్ద ఉన్న చంద్రమౌళీశ్వరస్వామి ఆలయాన్ని స్వామివారు దర్శించుకుని అభిషేకం చేశారు.



సెప్టెంబర్ 2వ తేదీ వారణాసిలోని చేత్సింగ్ ఘాట్ వద్ద ఉన్న ఉత్తరభారతంలోని సింధీ సాంప్రదాయికులు స్వామివారిని దర్శించుకుని, సమావేశం అయ్యారు.







సెప్టెంబర్ 5వ తేదీ వారణాసిలోని చేత్సింగ్ ఘాట్ వద్ద ఉన్న శైవ ఆగమ విద్వత్సభ ప్రారంభమై, 6వ తేదీ ముగిసింది. ఈ కార్యక్రమంలో గంగ హారతి, పుస్తకావిష్కరణ, పండితులకు బిరుదు ప్రధానం, సర్టిఫికెట్స్ పంపిణీ, సంభావనలతో సత్కరించడం జరిగింది.



సెప్టెంబర్ 7, 8వ తేదీలలో వారణాసిలోని చేత్సింగ్ ఘాట్ వద్ద ఉన్న శైవ ఆగమ విద్వాంసులు రుద్రహోమం, చండీహోమం నిర్వహించి, స్వామివారి సమక్షంలో పూర్ణాహుతి అత్యంగ భక్తిశ్రద్ధలతో చేసి, స్వామివారి ఆశీస్సులు పొందారు.



సెప్టెంబర్ 10వ తేదీ వారణాసిలోని చేత్సింగ్ ఘాట్ వద్ద గంగాతీరంలో పాఠశాల విద్యార్థులు వచ్చి స్వామివారి సమక్షంలో సూర్యనమస్కారాలు చేసి స్వామివారి ఆశీస్సులు పొందారు.



సెప్టెంబర్ 10వ తేదీ వారణాసిలోని చేత్సింగ్ ఘాట్ వద్ద స్వామివారి సమక్షంలో క్షత్రియ సమ్మేళనం జరిగింది.






**సెప్టెంబర్ 17వ** తేదీ వారణాసిలోని చేత్సింగ్ ఘాట్ వద్ద స్వామివారి సమక్షంలో భారతీయ భాషా దివస్ జరిగింది. ఈ కార్యక్రమంలో అనేకమంది ప్రముఖులతో పాటు పాఠశాల విద్యార్థులు కూడా పాల్గొన్నారు.



# 108 అడుగుల శ్రీ ఆది శంకరాచార్య విగ్రహావిష్కరణ



సెప్టెంబర్ 21వ తేదీన మధ్య ప్రదేశ్ లోని ఓంకారేశ్వర క్షేత్రం లో నర్మదానది తీర ప్రాంతంలో 108 అడుగుల శ్రీ ఆది శంకరాచార్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. శ్రీ ఆది శంకరాచార్యులు తమ గురువులు శ్రీ గోవింద భగవత్పాదాచార్యులని దర్శించి, సన్యాస దీక్ష గ్రహించిన ఈ పుణ్య క్షేత్రంలో 'ఏకాత్మ ధామ్' అనే పేరుతో ఒక పెద్ద అద్వైత వేదాంత కేంద్రాన్ని మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ శివ రాజ చౌహాన్ గారి నేతృత్వంలో మధ్య ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది.

ఈ సందర్భంగా దేశానికి చెందిన ముఖ్య శంకర మఠాల నుండి పీఠాధిపతులు తమ ఆశీర్వాదాన్ని అందించారు. శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారు వారణాసి నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. శ్రీ స్వామివారు ఆది శంకరుల అవతార మాహాత్మ్యమును స్మరించి, మధ్య ప్రదేశ్ ప్రభుత్వాన్ని, 'ఏకాత్మ ధామ్' పట్ల శివరాజ్ చౌహాన్ గారి మహోన్నత పరిశ్రమను ప్రోత్సహించారు. తదుపరి శ్రీ కంచిమఠము తరఫు నుండి శ్రీ చంద్రమౌళీశ్వర పూజా ప్రసాదాలను, శంకరావతారణ శ్లోకాలను, ముఖ్యమంత్రిగారికి అందజేశారు.











సెప్టెంబర్ 25వ తేదీన వారణాసిలో "కల్ వైత్త వారమ్" వేదపరీక్షలు నిర్వహించారు. ఈ కఠిమ పరీక్షలో వేదవిద్యార్థులను 'Surprise test' విధానంలో పరీక్షాధికారులు ప్రశ్నించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు శ్రీస్వామివారు బహుమతులను ఆశీర్వాదప్రసాదాలను అందించారు.

శ్రీః



## పుస్తకావిష్కరణ

# 'కాశ్మీర స్తబకం'








**శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి ఆశీస్సులతో, మార్గదర్శకంతో వెలువడింది**

**సెప్టెంబర్ 24, 2023, వారణాసి**

సెప్టెంబర్ 24న 'కాశ్మీర స్తబకమ్' అనే పుస్తకం వారణాసిలో చాతుర్మాస్య దీక్షలో వున్న శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి కరకమలములచే వెలువడింది. ఈ పుస్తకం కాశ్మీర్ యొక్క సాంస్కృతిక వారసత్వపు సంపదను వివరంగా ఆహ్లాదకరమైన చిత్రాలతో రమ్యంగా రూపుదిద్దుకుంది.

జమ్ము-కాశ్మీర్ చారిత్రిక, భౌగోళిక, మహిమాన్వితమైన గొప్ప వారసత్వపు సంపదను ప్రజలకు తెలియ చేయాలని తద్వారా అందులో దాగి ఉన్న గొప్పతనాన్ని, పవిత్రతను అందరూ గ్రహించాలని స్వామివారి మహాసంకల్పం. 386 పుటలు కలిగిన ఈ పుస్తకములో 'రాజతరంగిణి' (కాశ్మీరును పాలించిన రాజుల సనాతన ధర్మ పరమైన మరియు సాంస్కృతిక కార్యక్రమాల విశ్లేషణ) 'భృంగీశ సంహిత' (స్థల పురాణం - శివుడు కాశ్మీరు యొక్క వైభవాన్ని ఉన్నతిని పార్వతితో సంభాషణలలో తెలిపిన వైనం), 'నీలమత పురాణం' (నాగసాధువుల ప్రధాననాగ అమీద్ నీలా 1613 శ్లోకాలలో ఇచ్చిన ఉపదేశాలు), కాశ్మీర్లోని ఎన్నో తీర్థాలు, క్షేత్రాలు పండుగల వివరణ, జమ్మూ కాశ్మీరులోని ఆలయాల సంగ్రహ వివరణ, కంచి & కాశ్మీర్ - శ్రీ కంచి కామకోటి పీఠానికి కాశ్మీరుకు వున్న పురాతన చారిత్రాత్మక బంధం. ప్రతి ఏడాది చేపట్టే వార్షిక శంకర జయంతి వేడుకలు, కాశ్మీర్ సాంస్కృతిక వారసత్వపు అవగాహనకై ప్రతి వారం జరిగే ప్రసంగాలు ఇలా ఎన్నో గొప్ప సారాంశాలను చక్కగా విశ్లేషించారు.

ప్రతుల కోసం సంప్రదించవలసిన లింక్
**www.kanchimuttseva.org/books**

**శ్రీ కంచి కామకోటి పీఠం ద్వారా ప్రచురితం**

# లోక కళ్యాణార్థం వారణాసిలో శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి చాతుర్మాస్యవ్రతం

శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి రాక వలన, వారణాసి, హనుమాన్ ఘాట్‌లో వున్న శంకరమఠం పున్నమికి పొంగిన ప్రవాహమయింది.

వారణాసి మన భారతదేశ ఆధ్యాత్మిక కేంద్రం. తీర్థయాత్రలు సంకల్పించిన వారికి ముందుగా గుర్తుకు వచ్చేది వారణాసి. జ్యోతిర్లింగాలలో కాశీ విశ్వేశ్వరుని కూడలి. కిరీటంలో కలికితురాయిలా అక్కడ మరో విశిష్టత కలిసి వచ్చింది. శ్రీ కంచి కామకోటి 70వ పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు చాతుర్మాస దీక్ష కోసం హనుమాన్ ఘాట్‌లో వున్న శంకరమఠంలో బస చేశారు. జులై 3వ తారీఖు, గురు పూర్ణిమ రోజున త్రివేణి సంగమం ప్రయాగరాజ్‌లో వ్యాసపూజ చేసి, జులై 5వ తారీఖున కాశీ చేరారు. అక్కడ కాశీ రాజు, యువరాజు, పట్టణ మేయరు, పట్టణ వాసులతో సహా అందరూ శంకరాచార్యుల వారికి ఘనస్వాగతం పలికారు. అలా మొదలైన చాతుర్మాస దీక్ష సెప్టెంబర్ 29వ తారీఖు శుక్రవారం సంపూర్ణం అయింది. సాయంత్రం స్వామివారి విశ్వరూప యాత్ర నది దాటి సంకటమోచన హనుమాన్ మందిరం చేరగా, భగవద్గీతలోని విశ్వరూప అధ్యాయ పారాయణం జరిగింది. శ్రీ కంచి కామకోటి పీఠ శంకరాచార్యులు సుమారు 50 సంవత్సరాల తరువాత వారణాసిలో చాతుర్మాస్య వ్రతదీక్ష చేపట్టడం జరిగింది. శ్రీ కంచి పీఠ పరమ గురువులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామివారు 1934వ



సంవత్సరంలో, శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారు 1974 సంవత్సరంలో ఇప్పుడు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు 2023 సంవత్సరంలో చాతుర్మాస్య వ్రతం ఇక్కడ నిర్వహించడం మన అందరి అదృష్టం.

దీక్షలో వున్న శ్రీ విజయేంద్రుల దర్శనం కోసం వివిధ ప్రాంతీయ భాషల వారి రాకపోకలతో ఈ శంకరమఠం రంగుల హరివిల్లులా మారింది. అంతేకాదు ఈ సందర్భంగా ఈ శ్రీమఠం ప్రత్యేక జాతీయ సదస్సులు కూడా ఏర్పాటు చేసింది. సంవత్సర పంచాంగ సదస్సు, అద్వైత వేదాంత సదస్సు, తిరుమల తిరుపతి వారి సహకారంతో చతుర్వేద పారాయణం, గొప్ప విద్వత్తుగల వారిచే భాషణలు, హరికథలు, నృత్య, నాటక, సంగీత కచేరీలు గత మూడు నెలలుగా సాగుతున్నాయి. ఆగస్టు నెలలో శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారి (69వ పీఠాధిపతి) జయంతి వైభవంగా జరిగింది.

సెప్టెంబర్ 21 నుండి 28వ తారీఖు వరకూ మరో వైభవాంకం, విశ్వశాంతి మహాయజ్ఞం జరిగింది. గంగాతీరంలో లోక కళ్యాణార్థం లక్షమోదక మహాగణపతిహోమం, అతిరుద్రహోమం, సహస్ర చండీ హోమాలను శ్రీ మఠం వారు నిర్వహించారు. అతిరుద్రహోమం సంపూర్ణం అయిన సమయాన శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు మాట్లాడుతూ "ఈ మహాయజ్ఞం మానవ సమాజ సన్మార్గ ప్రవర్తన, సద్బుద్ధి కోసం నిర్వహించాము" అని పలికారు. తెలుగు, కన్నడ, తమిళనాడు నుంచి వచ్చిన ఋత్విక్కులు పాల్గొని ఈ యాగాన్ని సంపూర్ణం చేశారు. వేదవిద్యార్థులను, పండితులను వివిధ సదస్సుల్లో సన్మానించారు. కొన్ని పుస్తకాలను ఆవిష్కరించారు. సుమారు 500 మంది కాశీ వేద విద్యార్థులు భగవద్గీత లేఖన యజ్ఞంలో పాలుపంచుకుని ఆగస్టు 25 నుండి 28 వరకు 3 రోజులలో సంపూర్ణ భగవద్గీత వ్రాశారు. అక్కడ నిర్వహించబడ్డ మరో ప్రత్యేక కార్యక్రమం, 120 మంది శివాచార్యులు పాల్గొన్న 'కాశీ – గంగాతీర్థ శివగామ విద్వత్ సభ'.

1962లో ఇలయాత్తమ్ గుడి అనే ప్రదేశంలో శ్రీ చంద్రశేఖరరేంద్ర సరస్వతీ మహాస్వామివారు, శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారి సమక్షంలో వ్యాస భారత ఆగమ సదస్సు నిర్వహించబడింది. ఆ విధంగానే గంగానదీ తీరాన వారణాసిలోనూ అలాంటి సదస్సు జరిగింది. ఇన్ని ప్రత్యేక కార్యక్రమాల మధ్య శ్రీశంకరాచార్యుల వారి ఆశీర్వాదం అందుకోవడానికి దూరదూరాల నుండి భక్తుల రాక పోకలూ పెరిగాయి. ఈ ప్రత్యేక హోమాలు జరుగుతున్న ఆఖరివారం ఒక ఎత్తైతే, జరిగిన 3నెలల దీక్షాసమయం మరో ఎత్తు.

అక్టోబర్ 10వ తేదీ శ్రీమఠం విజయయాత్ర అయోధ్య చేరుతుంది. అక్కడే నవరాత్రి పూజా కార్యక్రమాలు శ్రీస్వామివారు నిర్వహిస్తారు. శంకర చానల్, కామకోటి టి.వి. ద్వారా ఎప్పటికప్పుడు శ్రీమఠం కార్యక్రమాలను వీక్షించవచ్చు. కామకోటి పీఠంవారి వెబ్‌సైట్‌లోనూ వివరాలు పొందవచ్చు.

విజయ యాత్ర ముఖ్య ఉద్దేశ్యం : శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారు తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో గత సంవత్సరన్నర కాలంగా మాడ్చే ఎండలు, కుంభవృష్టి వర్షాలకు లెక్కచేయకుండా సుమారు 5,000 కి.మీ. రోడ్డు ప్రయాణం చేశారు. ప్రతిరోజూ కొన్ని గంటల పాటు సాగే శ్రీ మహాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీస్వరస్వామి పూజతో సహా, నిరంతరం అతిథులను కలవడం, భక్తులను ఆశీర్వదించడం, శ్రీమఠం కార్యనిర్వహణలో సలహాలు ఇవ్వడం, సదస్సులు, శ్రీ మఠం నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలలో నిర్విరామంగా పాల్గొంటారు.

సత్యాన్వేషణ, సామాజిక హితవు కోసం దేశ సంచారం చేయడం అనేది శ్రీశంకరాచార్య పరంపరలోని సాంప్రదాయం. కనుకనే వారు పరమహంస, పరివ్రాజకాచార్య గురువులుగా ఉన్నారు. అద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తూ, దేశం నలుమూలలా ప్రజలను చేరటమే ఈ విజయయాత్ర ఉద్దేశ్యం. శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి గురువులు శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారు, వారి పరమ గురువులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు కూడా ఇలాగే విజయ యాత్ర చేశారు.

"ఆదిశంకరులు ఉపదేశించిన మూల సూత్రాలను, మన వారసత్వ సంస్కృతిని, సనాతనధర్మ సంరక్షణంలో సమాజానికి మార్గదర్శకత్వం సూచించడం లాంటివి మఠాధిపతిగా శంకరాచార్యుల ముఖ్య ఉద్దేశ్యం. ఈ విధంగా విజయయాత్రలో వివిధ ప్రాంతాలలో పర్యటించడం వలన, ఎంతోమంది ప్రజలకూ, వివిధ ప్రాంతాలకూ మంచి జరుగుతోంది. వారితోపాటూ పీఠం కదులుతూ, వివిధ ప్రాంతాలలో ఆదిశంకరులచే ప్రతిష్ఠించిన యోగలింగ పూజ జరపడం వలన ఎంతో మంది ప్రజలకూ శుభం కలుగుతోంది. దేశం నలుమూలల నుండి శంకరాచార్యులవారికి ఆహ్వానాలు వచ్చినా ఈ మధ్య వచ్చిన కోవిడ్ అవాంతరం వలన ఈ విజయ యాత్ర కొంచెం వెనుకబడింది. శంకరాచార్యులు ఏ ప్రాంతం చేరినా భక్తులు ప్రవాహంలా దర్శనానికి వస్తున్నారు.".

**(ఈ వ్యాసం శ్రీమతి గీతా వెంకట్‌రామన్‌గారి ద్వారా 27 సెప్టెంబర్‌న ది హిందు ఆంగ్ల వార్తాపత్రికలో రాయబడినది. తెలుగు అనువాదం: శ్రీమతి యం. బాలామణి గారు.)**

# వారణాసిలో విశేషంగా లక్షమోదక గణపతి, అతిరుద్ర, సహస్ర చండీ హోమాలు

## గణపతి హోమం

సనాతన ధర్మంలో తొలి పూజలు అందుకునే దేవత గణపతే. ఏదైనా కొత్త పనిని చేపట్టినప్పుడు అందులో విఘ్నాలు, సంకటాలు రాకుండా పూజించే తొలి దేవత హోదాను పరమేశ్వరుడే గణపతికి కల్పించాడు. త్రిపురాసురులను జయించేందుకు బయలుదేరినప్పుడు, ముందుగా గణపతిని పూజించనందుకు సాక్షాత్తు పరమశివుడే గణపతి ఆగ్రహానికి గురయ్యాడుట. శివుడు గణపతికి పూజ చేయగా, ప్రసన్నుడైనన గణపతి శివుడికి 'గణపతి సహస్రనామ స్తోత్రాన్ని' బోధించారు. సర్వదేవతలలో గణపతి అత్యంత ప్రాచుర్యం పొందిన దేవుడు. ఆయనను ప్రతి ఒక్కరూ భక్తి విశ్వాసాలు, ప్రేమతో పూజిస్తారు, స్తుతిస్తారు. మానవ శరీరంలో పృధ్వీ తత్వానికి ప్రాతినిధ్యం వహించే మూలాధార చక్రానికి గణపతి ఆధిపత్యం వహిస్తారు. ఆయన త్యాగానికి నిలువెత్తు ఉదాహరణగా నిలుస్తారు. భగవాన్ వేద వ్యాసుడు మహాభారతాన్ని చెప్తుండగా, దానిని రచించేందుకు తన అందమైన దంతాన్ని ఆయన విరిచి కలంగా ఉపయోగించారు. మందరపర్వతం నుంచి శివుడు కాశీకి పంపిన బ్రహ్మ, సూర్యుడు, యోగినులు, ఇతర దేవతలను అన్వేషిస్తూ ఆయన డూంఢి గణపతిగా కాశీకి వచ్చారు. దివోదాస మహారాజు కైలాసానికి బయలుదేరిన తర్వాత విష్ణువుతో కలిసి శివుడిని (విశ్వనాథుడిని) కాశీకి చేర్చే పనిని నెరవేర్చారు. అతడి తెలివిని శివుడు మెచ్చుకున్నాడు (స్కంద పురాణంలోని కాశీ ఖండం)

**శ్లో ॥ అన్వేషణే ఢుఢిరయం ప్రథితోస్తి ధాతు: సర్వార్థఢునితయా తవ ఢునినామ,**
**కాశీ ప్రవేశమపి కో లభతేత్ర దేహీ తోషం వినా తవ వినాయక ఢునిరాజ. (4.2.57.33)**

"డూంఢ్' అనే మూలానికి, వెతకడం, అన్వేషించడం అని అర్థం. భక్తుల కోరికలన్నింటినీ నెరవేర్చేందుకు వెతుకుతావు కనుక నువ్వు ఇప్పుడు డూండీవి. ఓ వినాయకా! ఓ డూంఢిరాజా! నిన్ను సంతోషపెట్టకుండా, ఈ భూమిపైన ఏ జీవి కాశీలోకి ప్రవేశించలేదు?" అంటూ శివుడు ఇంకా ఇలా అన్నాడు –

**శ్లో ॥ ఢునే ప్రణమ్య పురతస్తవ పాదపద్మం యో మాం నమస్యతి పుమాన్ ఇహ కాశివాసీ,**
**తత్కర్ణమూలమధిగమ్య పురా దిశామి తత్కిందత్ర న పునర్భవతాస్తి యేన. (4.2.57.34)**

"మొదటగా నీ పాదపద్మాలను పూజించి, తర్వాత నన్ను ఆరాధిస్తారో, అటువంటి వారి మరణ సమయంలో ఈ సంసారానికి తిరిగి రాకుండా ఉండేందుకు తోడ్పడే మహామంత్రాన్ని చెవిలో చెప్తాను"

అథర్వశీర్షం గణపతిని పరమాత్మ స్వరూపుడిగా, ఈ విశ్వ సృష్టి, స్థితి, లయకారకుడిగా అభివర్ణిస్తుంది. పురాణాలు ఆయన ఆవాసాన్ని





స్వనాద/ఆత్మానంద/ సచ్చిదానంద భవనంగా వర్ణిస్తాయి.

కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు అన్ని కుటుంబాలలో జరిగే వైదిక కర్మలలో గణపతి హోమం అన్నది సర్వసాధారణంగా కనిపిస్తుంది. శక్తిమంతమైన గణపతి మూలమంత్ర ఉచ్చారణతో ఆయనకు ఇష్టమైన నైవేద్యాలతో, మోదకాలతో ఆహుతులను అర్పించి, గణపతిని పూజించడం జరుగుతుంది. మోదక అంటే, సచ్చిదానందాన్ని ఇచ్చేవాడని అర్థం. గణపతిని సంతుష్టపరిస్తే, భక్తుడికి మోద, ఆమోద, ప్రమోద, సమోద, విమోద అంటూ వివిధ స్థాయిలో ఆనందాన్ని కల్పిస్తాడు. ఇవన్నీ కూడా గణపతి స్వంత రూపాలే. ఇందులో 56 రూపాలలో కాశీలోనే అవతరించారు. గణపతి అథర్వ శీర్షం ఇలా పేర్కొంటుంది "యో మోదక సహస్రేణ యజతి స వాంఛిత ఫలమవాప్నోతి" "ఎవరైతే వెయ్యి మోదకాలతో గణపతి హోమాన్ని చేస్తారో, అటువంటివారికి అన్ని కోరికలు నెరవేరి, వాటి ఫలాలను పొందుతారు". ఇక లక్ష మోదక హోమంలో లక్ష మోదకాలను అర్పించి, గణపతిని సంతుష్టిపరచడం అన్నది భక్తుడి అన్ని కోరికలూ నెరవేరడమే కాదు సర్వశ్రేయస్సు, సంతోషం కలుగుతాయనే విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా?

## అతిరుద్రహోమం

శ్రీ రుద్ర వైభవాన్ని శృతులు, స్మృతులు, పురాణాలు, మహాభారతం కూడా గానం చేశాయి. శ్రీ రుద్రంలో 11 అనువాకాలు (చరణాలు లేక పద్యాలు) ఉంటాయి. రుద్రుడిని లేక శివుడిని మొదటి అనువాకంలోని స్తుతి, ప్రార్థనల ద్వారా శాంతింపచేస్తారు. ఇక 2 నుంచి 9 అనువాకాలలో ఆ పరమేశ్వరుడి సర్వవ్యాపకత్వం, సర్వశక్తిమత్వం, సర్వజ్ఞత్వ లక్షణాలను ఆవాహన చేసే నామాలను జపించడం ద్వారా ఆయనను ప్రసన్నం చేసుకుంటాయి. శ్రీ పరమేశ్వరుడి మూడువందల నామాల ముందు, తర్వాత కూడా 'నమః' అన్న రెండు, మూడు పదాలతో అల్లడం వల్ల శ్రీరుద్రానికి 'నమకం' అన్న పేరు వచ్చింది. ఇక 10వ అనువాకం తనను ఆదరించమని కోరుతూ చేసే ప్రార్థన. 11వ అనువాకం అసంఖ్యాక రుద్రగణాలకు అభివాదాలు, ప్రణామాలతో కూడి ఉంటుంది. దీని తర్వాత త్రియంబక మంత్రంగా ప్రాచుర్యం పొందిన మహామృత్యుంజయ మంత్రం ఉంటుంది. త్రినేత్రుడైన శివుడికి చేసే ప్రార్థనలో మరణం నుంచి రక్షించమని, మోక్ష మార్గంలో నిశ్చలంగా పయనించేలా చూడమని కోరడం జరుగుతుంది.

శ్రీ రుద్రాధ్యాయం అన్నది కృష్ణ యజుర్వేదంలోని నాలుగవ కాండలోని ఐదవ ప్రశ్నలో వస్తుంది. ఇక ప్రసిద్ధ పంచాక్షరీ మంత్రం, 'నమః శివాయ' అన్నది శ్రీ రుద్రం మధ్యలో 8వ అనువాకంలో వస్తుంది. శ్రీ రుద్రాన్ని రకరకాల పేర్లతో పిలుస్తారు. శత రుద్రీయం, రుద్రోపనిషత్, రుద్రాధ్యాయం, నమకం. వేదాలలోని వందకు పైగా శాఖలలో ఈ శ్రీరుద్రం వస్తుంది కనుక దీనిని శతరుద్రీయం అని కూడా అంటారు. అనేక వేదశాఖలను ఒక చోట కూర్చిన సారాంశంగా, అత్యున్నతమైన పురుషార్థాన్ని, ముక్తిని ఇస్తుంది కనుక దీనిని రుద్రోపనిషత్‌గా పరిగణిస్తారు. ప్రార్థనతో సంతుష్టుడైన భగవంతుడి అనుగ్రహంతో, మానవజన్మకు అవసరమైన – ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే ఫలాలను భక్తుడు పొందగలడనేది నిస్సందేహం.








వేదమే చెప్తుంది : రుద్రాధ్యాయీ ముచ్యతే సర్వపాపై: బీ య: శతరుద్రీయం

అధీతే సోగ్నిపూతో భవతి బీ సంసారార్ణవతారణం

అని, "శ్రీరుద్రాన్ని జపించేవారు అన్ని పాపాల నుంచి విముక్తులవుతారు; అగ్ని వారిని శుద్ధి చేస్తుంది; శ్రీరుద్రం ఈ సంసార సాగరాన్ని (జనన మరణ చక్రాన్ని) దాటేలా చేస్తుంది."

సూత సంహిత ఇలా అంటుంది :

వృక్షస్య మూలసేకేన శాఖా: పుష్యన్తి వై యథా,

శివే రుద్రజపాత్ ప్రీతే ప్రీతా ఏవాస్య దేవతా:

"చెట్టు వేర్లకు నీరుపోసిన ఫలితంగా కొమ్మలు, పువ్వులు తదితరాలు ఎలా ఆరోగ్యంగా పెరుగుతాయో, అలాగే శ్రీరుద్ర జపంతో శివుడు సంతుష్టుడైనప్పుడు దేవతలు కూడా సంతోషిస్తారు."

రుద్రైకాదశిని అంటే 11మంది ఋత్విక్కులు 11సార్లు శ్రీరుద్రాన్ని జపిస్తే చమకం ఒకసారి పూర్తి అవుతుంది. మహారుద్రం అంటే 11 ఋత్విక్కుల చొప్పున 11 గణాలు 11సార్లు అంటే మొత్తం 11×11×11ా1331 సార్లు రుద్రాన్ని జపించడం. అతిరుద్రమనేది 11 మహారుద్రాలకు సమానం; కనుక శ్రీ రుద్ర మంత్రాలను 11×1331ా 14641 సార్లు జపించడం; ఇది నిర్దిష్ట సంఖ్యలో కొన్ని రోజుల పాటు సాగుతుంది. ప్రతిరోజూ 12మంది ఋత్విక్కులు శ్రీరుద్రాన్ని 11సార్లు జపించి, వశోర్ధార, చమక మంత్రాలతో నైవేద్యాలను సమర్పిస్తారు; కొన్ని రోజులపాటు విస్తరించిన ఈ మొత్తం ఆహుతులు జప గణనలో పదవ వంతు అంటే 1465 సార్లు.

ఘోరమైన పాపాలకు కూడా అత్యున్నత ప్రాయశ్చిత్తంగా మహారుద్రాన్ని కీర్తిస్తారు. "మహారుద్రం ప్రకుర్వీత మహాపాతక నాశనం" ఆదిత్యాత్మక రుద్ర, భవోద్భవ, దేవదేవ, భీమ, విజయ, ఈశాన, నీలలోహిత, శంకర, రుద్ర, శివ, మహాదేవ వంటి శ్రీ పరమేశ్వరుని 11 రూపాలకు ఏకకాలంలో అనేకమంది ఋత్విక్కులు ఉమ్మడిగా జప, అభిషేక, పూజ, హోమాలు చేయడమన్నది వాతావరణాన్ని శుద్ధి చేసి, విశ్వశాంతికి, శ్రేయస్సుకు దారి తీస్తుంది.

## సహస్ర చండీ హోమం

చండీ – దుర్గాసప్తశతి – దేవి మాహాత్మ్యం అన్నవి మార్కండేయపురాణంలో 13 అధ్యాయాలు, 700ల శ్లోకాలలో విస్తరించి ఉంటుంది. ఇది అసురులతో చేసిన యుద్ధాలలో దుర్గాదేవి విజయానికి సంబంధించిన మూడు ముఖ్య కథలను వివరిస్తుంది – మహాకాళిచే మధు–కైటభుల హననం, మహాలక్ష్మిచే మహిషాసుర వధ, మహా సరస్వతిచే శుంభ– నిశుంభుల నిర్మూలనం. దీనితో పాటుగా, అన్నింటినీ కోల్పోయి దు:ఖంలో ఉన్న రాజు సురతుడు, వైశ్యలకు మేధస్ముని చండీ పారాయణ చేసి, పూజించవలసిందిగా సలహా ఇచ్చిన వృత్తాంతం నేపథ్యంగా ఉంటుంది.





మూడేళ్ళపాటు ఏకాగ్రతతో పూజించిన తర్వాత, వారికి దేవి అనుగ్రహం కలుగుతుంది; సురతుడు తిరిగి రాజు కావడమే కాక, తదుపరి మన్వంతరంలో మను హోదాను పొందుతాడనే వరాన్ని పొందగా, సమాధిని అంతిమ జ్ఞానంతో దేవి ఆశీర్వదిస్తుంది. చండీలో అనేక అందమైన దేవీ స్తోత్రాలు ఉన్నాయి.

**శ్లో ॥ విద్యా: సమస్తాస్తవ దేవి భేదా: స్త్రియ: సమస్తా: సకలా జగత్సు,**

**త్వయైకయా పూరితమంబయైతత్ కా తే స్తుతి: స్తవ్యపరాపరోక్తి:.**

"అన్ని విద్యలూ నీలో భాగమే; ప్రపంచంలోని అందరు స్త్రీలు నీ రూపాలే తల్లీ. ఈ విశ్వమంతా నీవే వ్యాపించి ఉన్నావు. నీవు ఉపమానాలకు, ప్రశంసలకు ఆవల ఉన్నావు. నీవు వాక్కు ఆవల ఉన్నావు. వాస్తవానికి నువ్వే వాక్కువు. అటువంటప్పుడు నిన్ను ఎలా పొగడాలి?"

**శ్లో ॥ రోగానశేషాన్ అపహంసి తుష్టా రుష్టా తు కామన్ సకలాన్ అభీష్టాన్,**

**త్వామాశ్రితానాం న విపన్నరాణాం త్వామాశ్రితా హ్యాశ్రయతాం ప్రయాన్తి.**

"దేవీ! నువ్వు సంతుష్టురాలివైనప్పుడు, వ్యాధుల నుంచి పూర్తిగా విముక్తులను చేస్తావు. నువ్వు ఆగ్రహంతో ఉన్నప్పుడు కోరుకున్నవాటినన్నింటినీ తీసుకుంటావు. నీ ఆశ్రయం పొందినవారికి ఎటువంటి ఆపదా దరి చేరదు, అంతేకాదు, దు:ఖంలో ఉన్న ఇతరులకు వారే ఆశ్రయం అవుతారు".

స్వయంగా దేవియే మనోజ్ఞమైన ఫలశృతిని అందించింది. అన్ని దుష్ట, శత్రు శక్తుల నుంచి రక్షణకు, సంపూర్ణమైన ఐహిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును భక్తులకి హామీ ఇస్తుంది.

దేవి ఆరాధనా పద్ధతులలో చండీ హోమం అన్నది అత్యంత శక్తిమంతమైన పద్ధతి. చండీలోని 700 శ్లోకాలను జపిస్తూ అగ్నిలోని దేవికి ఆహుతిని సమర్పిస్తారు. అలాగే, చండీలోని 13 అధ్యాయాల ముగింపులో పూర్ణాహుతి ఉంటుంది. దీనికి ముందు విస్తృతమైన కర్మకాండ, ఆగమాలతో చండీ జపం, రాత్రి సూక్తం, నవాక్షరి మూల మంత్రంతో జపించడంతో సహా వివిధ ఇతర మంత్రాలను జపిస్తూ ఆహుతిని ఇస్తారు. ప్రధాన హోమాన్ని జపం, వివిధ నైవేద్యాలు, వస్త్రాలు, పుష్పమాలలు, ఆభరణాలు తదితరాలను సమర్పించడం, దేవీ సూక్త జపంతో వశోర్ధారతో ముగిస్తారు. చండీ మంత్రాల జపం తొమ్మిది సార్లు చేసినప్పుడు దానిని నవ చండీ అంటారు. జపాన్ని వందసార్లు చేస్తే దానిని శతచండీ అని పిలుస్తారు. జపం వెయ్యిసార్లు చేసినప్పుడు అది సహస్ర చండీ అవుతుంది. సహస్ర చండీలో జప ఉచ్చారణ సంఖ్యలో పదో వంతు అంటే 100సార్లు అగ్నికి ఆహుతి సమర్పిస్తారు. అనేకమంది ఋత్విక్కులు పలురోజుల పాటు మంత్రోచ్చారణ, హోమం చేసి ప్రక్రియను పూర్తి చేస్తారు. తర్పణాన్ని హోమంలో పదో వంతు అంటే పదిసార్లు ఇచ్చి, మార్జన చేస్తారు.







సెప్టెంబర్ 27వ తేదీ

అతిరుద్రయాగం పూర్ణాహుతి సందర్భంలో ప్రముఖులు డా. శ్రీ సుబ్రహ్మణ్యస్వామిగారు వారి సతీమణితో శ్రీస్వామివారి దర్శనం చేసుకొని ఆశీస్సులు పొందారు.



**సెప్టెంబర్ 29న** శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు చాతుర్మాస్య దీక్షా విరమణ సందర్భంగా విజయ యాత్రగా సంకట్ మొచన్ హనుమాన్ దేవాలయానికి వెళ్లి, దర్శనానంతరం గీతా పారాయణం చేశారు. తదనంతరం భక్తులను అనుగ్రహించారు.













# మూకపంచశతి ఆర్యాశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

**శ్లో॥** పురతః కదా ను కరవై పురవైరివిమర్ద-పులకితాంగలతాం ।
పునతీమ్ కాంచీదేశం పుష్పాయుధవీర్య-సరసపరిపాటీం ॥ 21 ॥

**తాత్పర్యం:-** శివుని కౌగిలింతల చేత పులకించిన తీగవంటి శరీరముగల కాంచీనగరమును పవిత్రమొనర్చుచున్న మన్మథుని వీర్యము యొక్క సరసపరిపాటీయైన ఆమెను ఎప్పుడు ఎదుట చేసుకుందునో కదా!


**బాలమనోజ్ఞా:** "పురవైరివిమర్దపులక్గాలతాం" అని ఆ తల్లికి విశేషణంగా వేశారు. పురవైరి అనగా త్రిపురములను సంహరించినవాడు శివుడని అర్థం. మనలో కూడా సత్త్వరజస్తమోగుణాలనే త్రిపురాలు ఉన్నాయి. ఆ త్రిపురాలను సంహరించే శక్తి ఆ పరమాత్మకే ఉంది. జీవుని ఆవరించి ఉన్న ఈ త్రిపురాలు నశిస్తే గానీ తనకంటే భిన్నమైన పరమాత్మసంయోగం లభించదు. పరమాత్మను కలిస్తేనే బ్రహ్మానందప్రాప్తి. "సహస్రారే పద్మే సహరహసి పత్యా విహరసే" అని సౌందర్యలహరిలో శంకరులవాక్కు. శివాశివులసంయోగమే ఆనందము. శివుడు పరమాత్మ ఐతే తీగవంటి శరీరముకలిగినది కుండలినీ శక్తి అని కూడా పెద్దలు చెప్తారు. "పుష్పాయుధవీర్యసరసపరిపాటీమ్" అని అమ్మకు ఇంకో విశేషణాన్ని వేశారు. పుష్పాయుధుడు మన్మధుడు. పుష్పములే ఆయుధములుగా గలవాడు అని. "అరవిందమశోకంచ చూతం చ నవమల్లికా నీలోత్పలం చ పంచైతే పంచబాణస్య సాయకాః. "అని అమరకోశం. అలాగే ఆ తల్లి కూడా పంచతన్మాత్రలనే బాణములుగా కలిగి ఉన్నది. మన్మధుడు ప్రజాసృష్టి కోసం తన పుష్పబాణాలను ప్రయోగిస్తే, ఆ తల్లి తన తన్మాత్రలనే బాణాలను ప్రయోగించి తన భక్తులయొక్క మనస్సులను తనవైపు తిప్పుకొని వారికి పరమానందప్రాప్తిని కలుగజేస్తోంది. అటువంటి ఆ తల్లిని ఎదుట దర్శించి బ్రహ్మానందాన్ని ఎప్పుడు పొందుతానో? అని భావము.

శ్లో॥ పుణ్యా కాపి పురంధ్రీ పుంఖితకందర్పసంపదా వపుషా ।
పులినచరీ కంపాయాః పురమథనం పులకనిచులితం కురుతే ॥ 22 ॥

**తాత్పర్యము:-** కంపానదీతీర ఇసుకతిన్నెలలో సంచరించు ఒకానొక పుణ్యవతియైన గృహిణి మన్మధునికి రెక్కలు మొలిపింపచేయగల సంపదయైన తన శరీరంతో శివుని పులకలతో కప్పబడిన వానినిగా చేయుచున్నది.

**బాలమనోజ్ఞా :** "పురం ధ్రియతే ఇతి పురంధ్రీ" పురమనగా శరీరము. శరీరాన్ని ధరించినది కనుక పురంధ్రీ అని. అనగా జీవుడు. ఆ జీవుడు పురాకృతకర్మవిశేషముల చేతనే పురమథనుని అనగా సత్త్వరజస్తమోగుణాలను మథించేటటువంటి ఈశ్వరుని సంగతిని కోరుకుంటాడు. జీవునికి పరమాత్మని పొందాలంటే సాధనం ఏది? శరీరమే సాధనం. అదికూడా "పుంఖితకందర్పసంపదా" అన్నారు. కందర్పః అనే పదానికి పర్యాయంగా అంఙ్గః అని కూడా అనవచ్చు "కందర్పో దర్పకో-నంగఃకామఃపంచశరస్మరః" అని అమరకోశం. అంటే అంగములు లేని వాడు మనస్సు అని అర్థం. మనస్సుకు రెక్కలను మొలిపింజేసే సంపద శరీరము. అనగా జ్ఞానేంద్రియాలు. జ్ఞానేంద్రియాలకు అధిష్ఠాత మనస్సు. "మనష్షష్ఠానీంద్రియాణి" అని భగవద్గీత. కంపానదీతీరమున పరమాత్మ కోసం పరితపించుచూ సంచరించు జీవుడు తన ఇంద్రియాలనన్నింటిని శివుని యందు చేర్చి పులకించాడని (పలకించినదని) అర్థము. నదీతీరమున ఉండే ఇసుకతిన్నెల యొక్క సౌందర్యము రాత్రుల యందు ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ శ్లోకం శ్రీమద్భాగవతంలోని యమునానదీతీరము యందు గోపికలతో శ్రీకృష్ణుని విహారం స్మరింపచేస్తోంది.

# శ్రీ కామకోటివాణి
## ప్రత్యేక సంచిక




వెల - 250 రూపాయలు
(Postage 50 రూపాయలు అదనం)

ప్రత్యేక సంచిక కోసము
సంప్రదించవలసిన వివరాలు:

**శ్రీ కంచి కామకోటి క్యాంపు**

Email ID - srikamakotivaani@gmail.com



## For Sri Kamakoti Vaani Subscription



**Bank Details:**

**Account Name:**
Sri Kamakoti Touryatrika Trust SKV
Bank: ICICI Bank
Account No.: 440705000345
IFSC Code: ICIC0004407
UPI ID – SRIKAMAKOTIVAANI@icici

**Subscription**

₹ 480 INR (India)
₹ 5000 INR
(Lifetime, for 10 years)

e-mail id -
srikamakotivaani@gmail.com

Scan me!

Sri Kamakoti Vaani subscription payment gateway.

Donors may please contact:
**Prayaga Srinivas : 800 800 1335**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



SHRI KANCHI KAMAKOTI PEETAM
JAGADGURU SHANKARACHARYA SWAMIGAL
SHRIMATAM SAMSTHANAM
1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

www.kamakoti.org

fb.me/srikamakoti

youtube.com/kanchimath

twitter.com/kanchimatham

instagram.com/kanchimutt

Koo
koo @kamakoti

www.kamakoti.tv

www.kanchimuttseva.org

ESEVA PORTAL

for Online Puja Bookings & Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA


భవదావసుధావృష్టిః పాపారణ్య-దవానలా ।
భాగ్యాబ్ధిచంద్రికా భక్తచిత్తకేకి-ఘనాఘనా ॥